ONE click
ePaper
www.shanmukhavelugu.com

RNI : APTEL / 2023 / 89152

షణ్ముఖ
SHANMUKHAVELUGU
# వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక

Good for Health
Best for Readers
PL.NO.IR/RNP/SV/26/2026

సంపుటి : 03 సంచిక : 183

శనివారం 11 జూలై 2026 పేజీలు 8 వెల : రూ.3

Printed by Ongole. Published From Ongle, Nellore, Guntur, Markapur, Bapatla.

## పుంగనూరులో ఈవీ క్లస్టర్.. ప్రతి 30 కి.మీ.కు ఛార్జింగ్ స్టేషన్

ఏపీలో ఆటోమోటివ్, ఈవీ ఎకోసిస్టమ్ అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

పుంగనూరులో ఈవీ క్లస్టర్, గ్రీన్ కారిడార్లలో ఛార్జింగ్ స్టేషన్ల ఏర్పాటు

కొరియా సంస్థల కోసం ప్రత్యేకంగా రెండు ఆటో కాంపోనెంట్ పార్కులు



**(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ, జూలై 10)**

ఆంధ్రప్రదేశ్‌ను ఆటోమోటివ్, ఎలక్ట్రిక్ వాహన (ఈవీ) రంగంలో దేశానికే హబ్‌గా మార్చేందుకు పటిష్టమైన ప్రణాళికలతో ముందుకెళుతున్నామని రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్, విద్యా శాఖల మంత్రి నారా లోకేశ్ తెలిపారు. తమ ప్రభుత్వం తీసుకొచ్చిన "సుస్థిర ఎలక్ట్రిక్ మొబిలిటీ పాలసీ 4.0" కింద రాష్ట్రంలో విస్తృతమైన ఈవీ ఎకోసిస్టమ్‌ను అభివృద్ధి చేస్తున్నామని, ఈ ప్రయాణంలో భాగస్వాములు కావాలని కొరియన్ సంస్థలను ఆయన ఆహ్వానించారు. దక్షిణ కొరియా పర్యటనలో ఉన్న మంత్రి లోకేశ్, సియోల్‌లో కొరియా ఆటో ఇండస్ట్రీస్ కోఆపరేషన్ ఏజెన్సీ (కేఏఐసీఏ) ▶ 2లో

## టార్గెట్ ట్రంప్.. ఇరాన్ స్కెచ్‌ను లీక్ చేసిన ఇజ్రాయెల్



**(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ, జూలై 10)**

శాంతి ఒప్పందంతో పశ్చిమాసియాలో సుస్థిరత నెలకొంటుందని ఆశ పడేలోపే.. మళ్లీ ఉద్రిక్తతలు రాజుకున్నాయి. అమెరికా–ఇరాన్ పరస్పర దాడులతో గల్ఫ్ దేశాలు దద్దరిల్లుతున్నాయి. ఈ పరిణామాల వేళ ఇజ్రాయెల్ నిఘా వర్గాలు అగ్రరాజ్యానికి కీలక హెచ్చరికలు చేశాయి. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ను హత్య చేసేందుకు ఇరాన్ కొత్త కుట్రలు చేస్తున్నట్లు హెచ్చరించాయి. దీంతో పశ్చిమాసియాపై మళ్లీ యుద్ధ మేఘాలు కమ్ముకున్నాయి.

ఇజ్రాయెల్ అలర్ట్..ట్రంప్‌ను లక్ష్యంగా చేసుకుని దాడులు జరగొచ్చని అమెరికా నిఘా సంస్థలకు కొన్ని వారాలుగా సమాచారం అందుతూనే ఉంది. కానీ, దీని గురించి ఇజ్రాయెల్ అలర్ట్ చేయడం ఈ మధ్యకాలంలో ఇదే మొదటిసారి. ట్రంప్ హత్యకు ఇరాన్ ఓ నిర్దిష్ట ప్రణాళికను రూపొందించినట్లు తమకు సమాచారం వచ్చిందని ఇజ్రాయెల్ ఇంటెలిజెన్స్ అగ్రరాజ్యాన్ని హెచ్చరించింది. ఇరాన్‌లో ఖమేనీ అంతిమయాత్ర జరిగిన సమయంలో నెతన్యాహు సర్కారు.. ఈ సమాచారాన్ని అమెరికాకు అందజేసినట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. అయితే, ఈ కుట్రకు సంబంధించి ఇతర వివరాలేవీ బయటకు రాలేదు. ▶ మిగతా 2లో

## అభ్యంతరకర వ్యాఖ్యలు చేస్తే ఉపేక్షించవద్దు

### సీఎం చంద్రబాబు ఆదేశం

**(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూలై 10)**



సోషల్ మీడియాలో వ్యక్తిత్వ హననానికి పాల్పడే వారిపై చర్యలు తీసుకోవాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. దీనిపై టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేయాలని పోలీసు ఉన్నతాధికారులకు సూచించారు. శుక్రవారం నిర్వహించిన మంత్రివర్గ సమావేశంలో సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారంపై చర్చ జరిగింది. నేతలను కించ పరుస్తూ చేసే వీడియోలపై మంత్రులు తీవ్ర అభ్యంతరం తెలిపారు. వైకాపా వాళ్లు రెచ్చగొడితే రెచ్చిపోవద్దని నేతలకు సీఎం సూచించారు. అభ్యంతరకర వ్యాఖ్యలు చేస్తే ఉపేక్షించొద్దని పోలీసు అధికారులను ఆదేశించారు. కులపరమైన అంశాలు, తప్పుడు సమాచారాన్ని సోషల్ మీడియాలో వేగంగా స్ప్రెడ్ చేస్తున్నారని సీఎం చంద్రబాబు అన్నారు. తమ స్వార్థ రాజ కీయా లకు బ్లేడ్ బ్యాచ్, గంజాయి బ్యాచ్‌లను అడ్డు పెట్టుకుని కుట్రలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. వీటిపై పూర్తి నియంత్రణ రావాలని సీఎం ఆదేశించారు. ▶ 2లో

# ఏపీకి మరో భారీ పెట్టుబడి?..



- దక్షిణ కొరియాలో పెట్టుబడుల వేట.. షిప్‌బిల్డింగ్ దిగ్గజం హెచ్‌డీ కోస్‌తో లోకేశ్ భేటీ
- ఏపీలో సముద్ర రవాణా, షిప్ బిల్డింగ్ రంగాల్లో పెట్టుబడులు పెట్టాలని ఆహ్వానం
- సుదీర్ఘ తీరప్రాంతం, పోర్టులు, అనుకూల పాలసీలే మా బలమని వివరించిన మంత్రి
- ఏపీలో సైట్ల పరిశీలనకు అంగీకరించిన హెచ్‌డీ కోస్.. రాష్ట్ర పర్యటనకు ఆహ్వానం

**(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూలై 10)**

ఆంధ్రప్రదేశ్‌ను పారిశ్రామికంగా మరింత బలోపేతం చేసే లక్ష్యంతో రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ తన దక్షిణ కొరియా పర్యటనలో కీలక సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ప్రపంచ ప్రఖ్యాత నౌకా నిర్మాణ, ఇంజనీరింగ్ సంస్థ హెచ్‌డి కొరియా షిప్‌బిల్డింగ్ ఆఫ్‌షోర్ ఇంజనీరింగ్ (హెచ్‌డీ కోస్) ప్రతినిధులతో ఆయన భేటీ అయ్యారు. ఏపీలో సముద్ర రవాణా, షిప్‌బిల్డింగ్ రంగాల్లో పెట్టుబడులు పెట్టాలని కంపెనీ గ్లోబల్ బిజినెస్ డైరెక్టర్ క్విన్ యంగ్‌హూన్, టీమ్ లీడర్ హోంగ్ సున్‌జూన్‌లను లోకేశ్ ఆహ్వానించారు. ఈ సమావేశంలో మంత్రి లోకేశ్ ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులకు ఉన్న అపార అవకాశాలను, ప్రభుత్వ విధానాలను వివరించారు. "భారత తూర్పు తీరంలో 1053 కిలోమీటర్ల సుదీర్ఘ తీరప్రాంతంతో ఆంధ్రప్రదేశ్ వ్యూహాత్మకంగా ఎంతో కీలకమైన ప్రదేశంలో ఉంది. ప్రస్తుతం పనిచేస్తున్న ఆరు పోర్టులతో పాటు కొత్తగా రాబోతున్న డీప్–వాటర్ పోర్టులు, ప్రపంచ స్థాయి లాజిస్టిక్స్ మౌలిక సదుపాయాలు, పెట్టుబడిదారులకు ▶ 2లో

## ధాన్యం గోతాలు నేరుగా రైతులకే..

**(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూలై 10)**



ఖరీఫ్ నుంచి ఆర్ఎస్‌కే (రైతు సేవా కేంద్రాలు)ల ద్వారా రైతులకు గోతాలు అందించేలా ఏర్పాట్లు చేస్తున్నామని.. రైస్‌మిల్లర్ల ప్రమేయం ఉండదని పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ వివరించారు. రైతులే ధాన్యాన్ని మిల్లులకు తరలిస్తే రవాణా ఖర్చులూ నేరుగా వారి ఖాతాల్లో 48 గంటల్లోగా జమచేస్తామని చెప్పారు. రేషన్ దుకాణాల ద్వారా స్టీమ్ బియ్యాన్ని పంపిణీ చేస్తామని, అందుకు అనుగుణంగా మిల్లర్లు డ్రయర్లను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. 'రెండేళ్ల ధాన్యం సేకరణ, వచ్చే ఖరీఫ్ సేకరణకు సన్నద్ధత'పై విజయవాడలో పౌరసరఫరాల సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మనోహర్ పాల్గొని రెండేళ్ల ధాన్యం సేకరణ వివరాలతో పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 'వర్షంలో తడిచినా ఇబ్బంది లేకుండా.. ఎన్నిసార్లయినా వినియోగించుకునే పీపీ సంచులు అందుబాటులోకి తెస్తున్నాం' అని వివరించారు. రేషన్ కార్డుదారులకు 10% నూకలే ఉండే నాణ్యమైన బియ్యాన్ని పంపిణీ చేయాలని కేంద్ర మంత్రివర్గంలో నిర్ణయించినట్లు చెప్పారు. రెండేళ్ల కూటమి ప్రభుత్వ పాలనలో రైతులకు వాట్సప్ ద్వారా ధాన్యం షెడ్యూలింగ్, క్యూఆర్ కోడ్‌తో మధ్యాహ్నభోజన బ్యాగుల పంపిణీ, వేగవంతంగా నగదు జమ తదితర సంస్కరణల్ని ప్రవేశపెట్టామని మంత్రి వివరించారు.

**ఖరీఫ్, రబీల్లో 74 లక్షల టన్నులు.. రూ.17,592 కోట్లు**

గడచిన ఖరీఫ్, రబీల్లో రాష్ట్రవ్యాప్తంగా 10.32 లక్షల మంది రైతుల నుంచి రూ.17,592 కోట్ల విలువైన 74.13 లక్షల టన్నుల ధాన్యం సేకరించామని.. 24 గంటల్లోపే రైతుల ఖాతాల్లో నగదు జమచేశామని మనోహర్ పేర్కొన్నారు. వైకాపా ▶ 2లో

## తెలుగు వైభవాన్ని ప్రపంచానికి చాటాలి

**(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూలై 10)**

'తెలుగు భాష వైభవాన్ని ప్రపంచానికి చాటి చెప్పాలి. సమాజ చైతన్యానికి దోహదపడేలా రచనలు రావాలి. అందుకే 3వ అంతర్జాతీయ తెలుగు రచయిత్రుల మహాసభలు నిర్వహిస్తున్నారు' అని ఆ



మహాసభల గౌరవ అధ్యక్షులు, ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తెలిపారు. విజయవాడ కొత్తపేట కేబీఎన్ కళాశాలలో మీడియా ప్రతినిధుల సమావేశం నిర్వహించారు. ముందుగా ఆహ్వాన పత్రాల బుక్‌లెట్‌ను ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. మండలి వెంకటకృష్ణారావు ▶ 2లో

## రాష్ట్రంలో అలజడులు సృష్టించేందుకు వైసీపీ కుట్రలు పన్నుతోంది



హిందుత్వంపై కొందరు ఇష్టం వచ్చినట్టు మాట్లాడుతున్నారన్న విజయ్

పవన్ ను జడ శ్రవణ్ టార్గెట్ చేయడం వెనుక తాడేపల్లి పెద్దలు ఉన్నారని ఆరోపణ

జడ శ్రవణ్, రావణ్, ప్రకాశ్ రాజ్ పెయిడ్ ఆర్టిస్టులని విమర్శ

**(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూలై 10)**

ఆంధ్రప్రదేశ్‌లో మతాల మధ్య చిచ్చుపెట్టి, అలజడులు సృష్టించేందుకు వైసీపీ తెరవెనుక పెద్ద ఎత్తున కుట్రలు పన్నుతోందని జనసేన ఎమ్మెల్యే సుందరపు ▶ 2లో

## 40 ఏళ్ల తర్వాత న్యూజిలాండ్‌లో భారత ప్రధాని...

మూడు దేశాల పర్యటనలో భాగంగా అక్లాండ్ చేరుకున్న ప్రధాని మోదీ

దాదాపు నాలుగు దశాబ్దాల తర్వాత అక్కడ పర్యటిస్తున్న ఓ భారత ప్రధాని

ఎయిర్‌పోర్ట్‌లో మోదీకి స్వయంగా స్వాగతం పలికిన ప్రధాని క్రిస్టఫర్ లక్సన్

వాణిజ్యం, ఆర్థిక సంబంధాలపై ఇరు దేశాల ప్రధానుల మధ్య చర్చలు

**(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ, జూలై 10)**



భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన మూడు దేశాల పర్యటనలో భాగంగా ఈరోజు న్యూజిలాండ్‌లో అడుగుపెట్టారు. ఇండోనేషియా, ఆస్ట్రేలియా పర్యటనలను ముగించుకుని ఆయన శుక్రవారం ఆక్లాండ్‌కు చేరుకున్నారు. సుమారు నాలుగు దశాబ్దాల విరామం తర్వాత న్యూజిలాండ్‌లో పర్యటిస్తున్న తొలి భారత ప్రధానిగా మోదీ నిలిచారు. ఆక్లాండ్ విమానాశ్రయంలో న్యూజిలాండ్ ప్రధానమంత్రి క్రిస్టఫర్ లక్సన్ స్వయంగా మోదీకి సాదర స్వాగతం పలికారు.రెండు రోజుల పాటు సాగే ఈ పర్యటనలో ప్రధాని మోదీ, లక్సన్‌తో ద్వైపాక్షిక చర్చలు జరుపుతారు. ఇరు దేశాల మధ్య ఆర్థిక, వాణిజ్య సంబంధాలను మరింత బలోపేతం చేయడంపై ఈ భేటీలో ప్రధానంగా దృష్టి సారించనున్నారు. ఇటీవలే పురోగతి ▶ 2లో

## ఏపీఎస్ఆర్టీసీ ప్రైవేటీకరణ అంటూ ప్రచారం... స్పందించిన కూటమి ప్రభుత్వం

ఆర్టీసీ ప్రైవేటీకరణ వార్తలను ఖండించిన ఏపీ ప్రభుత్వం

ఇవన్నీ నిరాధారమైన వదంతులేనని స్పష్టీకరణ

పీఎం ఈ-బస్ సేవా పథకం కింద 750 ఎలక్ట్రిక్ బస్సులు

ఉద్యోగులకు ఎలాంటి నష్టం జరగదని ప్రభుత్వ హామీ

ఆర్టీసీ ఆస్తులు ప్రైవేటుకు అప్పగించబోమని వెల్లడి



**(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూలై 10)**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఏపీఎస్ఆర్టీసీ) ప్రైవేటీకరణపై జరుగుతున్న ప్రచారంలో ఎలాంటి వాస్తవం లేదని రాష్ట్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. ఇవన్నీ నిరాధారమైన ▶ 2లో





## మొదటి పేజీ తరువాయి

## ఏపీకి మరో భారీ పెట్టుబడి?..

అనుకూలమైన పారిశ్రామిక విధానాలు మా రాష్ట్ర ప్రత్యేకతలు" అని ఆయన తెలిపారు.

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' విధానం ద్వారా కంపెనీలు తమ ప్రాజెక్టులను అత్యంత వేగంగా ఏర్పాటు చేసుకోవచ్చని లోకేశ్ హామీ ఇచ్చారు. ఇందుకు కియా మోటార్స్, ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ వంటి కొరియన్ కంపెనీల విజయాలే నిదర్శనమని ఆయన గుర్తుచేశారు. "భారీ పారిశ్రామిక ప్రాజెక్టులను అతి తక్కువ సమయంలో పూర్తిచేసిన చరిత్ర, సామర్థ్యం మా రాష్ట్రానికి ఉన్నాయి. గూగుల్ డేటా సెంటర్, ఆర్సెలర్‌మిట్టల్ స్టీల్ ప్లాంట్, ఫైటర్ ఎయిర్‌క్రాఫ్ట్ తయారీ ప్రాజెక్టులు ఇటీవల ఏపీని ఎంచుకున్నాయి. ఇది మా పారిశ్రామిక వాతావరణంపై ప్రపంచ కంపెనీలకు పెరుగుతున్న నమ్మకాన్ని సూచిస్తోంది" అని మంత్రి అన్నారు. దేశంలోకి వస్తున్న మొత్తం విదేశీ పెట్టుబడులలో 25% వాటాతో ఏపీ అగ్రస్థానంలో ఉందని ఆయన పేర్కొన్నారు.

మంత్రి లోకేశ్ ఆహ్వానంపై హెచ్‌డి కోస్ గ్లోబల్ బిజినెస్ డైరెక్టర్ క్విన్ యంగ్‌హూన్ సానుకూలంగా స్పందించారు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రపంచ స్థాయి షిప్‌బిల్డింగ్, సముద్ర ఇంజనీరింగ్ ఉపకరణాల తయారీ యూనిట్ల ఏర్పాటుకు గల అవకాశాలను పరిశీలిస్తామని తెలిపారు. "మా సాంకేతిక, లాజిస్టికల్, వాణిజ్య అవసరాలకు అనుగుణంగా సరైన ప్రాంతాలను గుర్తించి మా అధికారులు మీకు తెలియజేస్తారు. దీర్ఘకాలిక అభివృద్ధికి అవసరమైన పారిశ్రామిక వాతావరణాన్ని ఏపీ అందించగలదని మేము విశ్వసిస్తున్నాం" అని ఆయన అన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధి, పెట్టుబడిదారులకు కల్పిస్తున్న సౌకర్యాలను ప్రత్యక్షంగా చూసేందుకు, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో సమావేశమయ్యేందుకు ఏపీకి రావాల్సిందిగా హెచ్‌డీ కోస్ నాయకత్వాన్ని మంత్రి లోకేశ్ ఆహ్వానించారు. ఈ సమావేశం విజయవంతం కావడంతో ఏపీ తీరంలో మరో భారీ పెట్టుబడికి మార్గం సుగమమైనట్లు విశ్లేషకులు భావిస్తున్నారు.

## పుంగనూరులో ఈవీ క్లస్టర్.. ప్రతి 30 కి.మీ.కు ఛార్జింగ్ స్టేషన్

ఛైర్మన్ టేక్-సుంగ్ లీ నేతృత్వంలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఈవీ రంగాన్ని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరించారు. ఈవీ ఎకోసిస్టమ్‌లో భాగంగా పూర్తిస్థాయిలో ఏపీఎస్‌ఆర్టీసీ బస్సులను విద్యుదీకరించడం, గ్రీన్ కారిడార్లలో ప్రతి 30 కిలోమీటర్లకు ఒక ఛార్జింగ్ స్టేషన్ ఏర్పాటు చేయడం, పుంగనూరులో ప్రత్యేక ఈవీ క్లస్టర్‌ను నెలకొల్పడం వంటి కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ-మొబిలిటీ నగరాల అభివృద్ధికి, ఈవీ పరిశోధనలకు ప్రత్యేక గ్రాంట్లు అందిస్తామని హామీ ఇచ్చారు. ముఖ్యంగా, ఈవీ బ్యాటరీలు, మాగ్నెట్‌ల తయారీకి అవసరమైన ముడిసరుకుల కోసం కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఏపీలో ఒక 'రేర్ ఎర్త్ కారిడార్' ఏర్పాటు చేయబోతున్నట్లు కీలక ప్రకటన చేశారు. రాష్ట్రంలో ఇప్పటికే బలమైన ఆటోమోటివ్ పరిశ్రమ ఉందని, చెన్నై-బెంగళూరు ఇండస్ట్రియల్ కారిడార్ పరిధిలో సుమారు 100 కిలోమీటర్ల మేర ఆటోమోటివ్ విడిభాగాల ఎకోసిస్టమ్‌ను అభివృద్ధి చేస్తున్నామని లోకేశ్ పేర్కొన్నారు. కియా మోటార్స్‌తో పాటు అశోక్ లేలాండ్, ఇసుజు, హీరో మోటోకార్ప్, అమర్ రాజా, అపోలో టైర్స్, భారత్ ఫోర్జ్ వంటి దిగ్గజ సంస్థలు ఇక్కడ కార్యకలాపాలు సాగిస్తున్నాయని గుర్తుచేశారు. అశోక్ లేలాండ్ సంస్థ సుమారు రూ. 2,500 కోట్ల పెట్టుబడితో లిథియం అయాన్ ఈ-బస్ ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తోందని వెల్లడించారు.

"అనంతపురంలో కియా మోటార్స్ సాధించిన అద్భుత విజయమే మా ప్రభుత్వ నిబద్ధతకు, సామర్థ్యానికి నిదర్శనం" అని లోకేశ్ అన్నారు. కొరియా కంపెనీల కోసం ప్రత్యేకంగా రెండు ఆటో కాంపోనెంట్స్ పార్కులను అభివృద్ధి చేస్తామని ప్రకటించారు. కియా క్లస్టర్ సమీపంలో ఒకటి, శ్రీసిటీ-చిత్తూరు-తిరుపతి కారిడార్‌లో మరొకటి ఏర్పాటు చేస్తామన్నారు. ఈ పార్కులలో ప్లగ్-అండ్-ప్లే షెడ్లు, ఉమ్మడి టెస్టింగ్ సౌకర్యాలు, పూర్తిస్థాయి సపోర్ట్ కోసం ఒక 'కొరియా డెస్క్' కూడా ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యం కలిగిన మానవ వనరులను అందించేందుకు ఏపీఎస్ఎస్‌డీసీ, కౌశలం ప్లాట్‌ఫామ్ ద్వారా ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈవీ పవర్‌ట్రెయిన్‌ల తయారీలో శిక్షణ ఇచ్చేందుకు ఒక అకాడమీని ఏర్పాటు చేయాలని, ఇందుకు రాష్ట్రంలోని 250కి పైగా ఇంజనీరింగ్ కళాశాలల సహకారం తీసుకోవాలని కొరియన్ సంస్థలను కోరారు. ఇరు ప్రాంతాల మధ్య సంబంధాలను మరింత బలోపేతం చేసేందుకు ఏపీ ఎకనమిక్ డెవలప్‌మెంట్ బోర్డు (ఏపీఈడీబీ)లో ప్రత్యేక కొరియా డెస్క్, ఒక ఉమ్మడి వర్కింగ్ గ్రూప్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు లోకేశ్ ప్రకటించారు.

## రాష్ట్రంలో అలజడులు సృష్టించేందుకు వైసీపీ కుట్రలు పన్నుతోంది

విజయ్ కుమార్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. వైసీపీ ఆడుతున్న ఈ ప్రమాదకరమైన రాజకీయ క్రీడను ప్రజలంతా గమనించాలని కోరారు. రాష్ట్రంలో సనాతన ధర్మం, హిందుత్వంపై కావాలనే కొందరు ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని విజయ్ మండిపడ్డారు. ఏలూరు సభలో జడ శ్రవణ్ అనే వ్యక్తి డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను వ్యక్తిగతంగా టార్గెట్ చేస్తూ మాట్లాడటం వెనుక తాడేపల్లి పెద్దల హస్తం ఉందన్న అనుమానాలు వ్యక్తం చేశారు. మత ఘర్షణలకు ప్లాన్ చేస్తున్న ఈ ముఠాకు, తాడేపల్లికి ఉన్న ఆర్థిక, రాజకీయ సంబంధాల గుట్టును పోలీసులు పూర్తిగా బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. జగన్‌కు వ్యతిరేకంగా తానే రూ. 25 కోట్లు ఖర్చు పెట్టానని చెప్పుకుంటున్న జడ శ్రవణ్‌కు అసలు అన్ని కోట్ల డబ్బులు ఎక్కడి నుంచి వచ్చాయో సమాధానం చెప్పాలని నిలదీశారు. ప్రశాంతంగా ఉన్న సమాజంలో విషం చిమ్మేందుకు కుట్రలు జరుగుతున్నాయన్నారు. యూట్యూబర్ రావణ్, నటుడు ప్రకాశ్ రాజ్, అలాగే జడ శ్రవణ్‌లకు అసలు సనాతన ధర్మం అంటే ఏంటో తెలుసా? అని ప్రశ్నించారు. వీరంతా కేవలం ఒక అజెండా ప్రకారం పనిచేస్తున్న 'పెయిడ్ ఆర్టిస్ట్‌లు' అని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వంలో అన్ని కులాలకు, మతాలకు సమాన గౌరవం లభిస్తుందని స్పష్టం చేసిన ఆయన... హిందుత్వంపై, సనాతన ధర్మంపై ఇలాంటి కుటిల యత్నాలు కొనసాగిస్తే మాత్రం ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలిపెట్టే ప్రసక్తే లేదని హెచ్చరించారు.

## 40 ఏళ్ల తర్వాత న్యూజిలాండ్‌లో భారత ప్రధాని...

సాధించిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం చర్చల నేపథ్యంలో ఈ పర్యటనకు అత్యంత ప్రాధాన్యత ఏర్పడింది. ఈ పర్యటనలో భాగంగా మోదీ ప్రవాస భారతీయులను ఉద్దేశించి కూడా ప్రసంగించనున్నారు. భారత్ 'యాక్ట్ ఈస్ట్ పాలసీ', 'మహాసాగర్' విజన్‌ను బలోపేతం చేయడంతో పాటు, స్వేచ్ఛాయుత ఇండో-పసిఫిక్ ప్రాంతం పట్ల తమ నిబద్ధతను ఈ పర్యటన పునరుద్ఘాటిస్తుందని మోదీ తన పర్యటనకు ముందు ఒక ప్రకటనలో తెలిపారు. 2025 మార్చిలో లక్సన్ జరిపిన భారత పర్యటనతో వచ్చిన సానుకూలతను ఈ పర్యటన మరింత ముందుకు తీసుకెళుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఆస్ట్రేలియా పర్యటనలో ప్రధాని మోదీ రక్షణ, సముద్ర సహకారాన్ని పెంపొందించుకోవడంతో పాటు, భారత్‌కు యురేనియం సరఫరాకు వీలు కల్పించే కీలకమైన పౌర అణు ఇంధన ఒప్పందం కుదుర్చుకున్నారు. అంతకుముందు ఇండోనేషియా పర్యటనలో కీలక ఖనిజాలు, సముద్ర భద్రత వంటి అంశాలపై పలు కీలక ఒప్పందాలు చేసుకున్నారు.

## ఏపీఎస్ఆర్టీసీ ప్రైవేటీకరణ అంటూ ప్రచారం... స్పందించిన కూటమి ప్రభుత్వం

వదంతులని, కేవలం దుష్ప్రచారం మాత్రమేనని కొట్టిపారేసింది. ఆర్టీసీని ప్రైవేటీకరించే ఉద్దేశం ప్రభుత్వానికి లేదని ఈ సందర్భంగా తేల్చిచెప్పింది. సచివాలయంలో రవాణా శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి. కృష్ణబాబు మీడియాతో మాట్లాడారు. ఆర్టీసీ ఆస్తులను ప్రైవేటు వ్యక్తులకు విక్రయించడం కానీ, లీజుకు ఇవ్వడం కానీ జరగదని ఆయన స్పష్టం చేశారు. సంస్థ ప్రయోజనాలతో పాటు ఉద్యోగుల భద్రతకు ప్రభుత్వం పూర్తి రక్షణ కల్పిస్తుందని భరోసా ఇచ్చారు. కేంద్ర ప్రభుత్వ 'పీఎం ఈ-బస్ సేవా' పథకం కింద ఎలక్ట్రిక్ బస్సులను ప్రవేశపెట్టడంపై ప్రతిపక్షాలు, ఉద్యోగ సంఘాల నుంచి ఆందోళనలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో ఆయన వివరణ ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ-బస్సుల పేరుతో ఆర్టీసీని ప్రైవేటీకరించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని గతంలో వైసీపీ నేతలు చేసిన ఆరోపణలను ఆయన ఖండించారు. జాతీయ విధానంలో భాగంగా రాష్ట్రంలోని 11 నగరాల్లో 750 ఎలక్ట్రిక్ బస్సులను ప్రవేశపెడుతున్నామని, తద్వారా రాష్ట్రానికి రూ. 1,774 కోట్ల ప్రోత్సాహకాలు లభిస్తాయని కృష్ణబాబు వెల్లడించారు. కొత్తగా వచ్చే ఈ బస్సులకు కూడా ఆర్టీసీ ఉద్యోగులే డ్రైవర్లుగా కొనసాగుతారని, ఎవరి ఉద్యోగానికి ఎలాంటి ముప్పు ఉండదని ఆయన హామీ ఇచ్చారు. ఉద్యోగుల వేతనాలు, మహిళలకు ఉచిత ప్రయాణం (స్త్రీ శక్తి), దివ్యాంగుల రాయితీల భారాన్ని ప్రభుత్వమే భరిస్తుందని పునరుద్ఘాటించారు. ప్రజలు అనవసర ప్రచారాలను నమ్మవద్దని, కేవలం ప్రభుత్వ అధికారిక ప్రకటనలను మాత్రమే విశ్వసించాలని ఆయన కోరారు.

## టార్గెట్ ట్రంప్.. ఇరాన్ స్కెచ్‌ను లీక్ చేసిన ఇజ్రాయెల్

**ట్రంప్‌ను ప్రభావితం చేసేందుకేనా..?**

హర్మూజ్‌లో నౌకలపై దాడులకు ప్రతీకారంగా ఇరాన్‌పై అమెరికా తాజా దాడులు చేపట్టింది. దీంతో టెహ్రాన్ కూడా విరుచుకుపడటంతో ఉద్రిక్తతలు చెలరేగాయి. అయితే, ఈ దాడులను మరింత తీవ్రతరం చేయాలా? లేక ఇరాన్‌తో కాల్పుల విరమణను కొనసాగించాలా? అనే దానిపై ప్రస్తుతం ట్రంప్ ఆలోచనలు చేస్తున్నట్లు సమాచారం. ఈ సమయంలో ఇజ్రాయెల్ నుంచి నిఘా అలర్ట్ రావడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ హెచ్చరికలు ట్రంప్ నిర్ణయాన్ని ప్రభావితం చేసే అవకాశం ఉందని కొందరు అమెరికా అధికారులు భావిస్తున్నారు. మరోవైపు, తనపై హత్య కుట్రల గురించి ట్రంప్ కూడా ఇటీవల కీలక వ్యాఖ్యలు చేశారు. తుర్కియేలో నాటో సదస్సు సమయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. "అమెరికా అధ్యక్షుడిని అడ్డు తొలగించాలని వారు (ఇరాన్‌ను ఉద్దేశిస్తూ) కోరుకుంటున్నారు. నేను అందరి హిట్ లిస్ట్‌లో ఉన్నాను" అని వ్యాఖ్యానించారు.

**మళ్లీ పాత విమానంలోనే ట్రంప్..**

ఈ పరిణామాల వేళ తుర్కియే నుంచి బయల్దేరిన ట్రంప్ మళ్లీ పాత విమానాన్నే వినియోగించడం కూడా చర్చనీయాంశంగా మారింది. వాస్తవానికి ఇటీవల అమెరికా అధ్యక్షుడి కోసం ఖతార్ ఓ అధునాతన విమానాన్ని కానుకగా ఇచ్చింది. అప్పటి నుంచి ట్రంప్ దాన్నే వినియోగించారు. నాటో సదస్సుకు కూడా అందులోనే వెళ్లారు. కానీ, అక్కడి నుంచి తిరిగెళ్లే సమయంలో మాత్రం పాత ఎయిర్‌ఫోర్స్ వన్ విమానంలో ప్రయాణించారు. ఇరాన్‌తో ఉద్రిక్తతల నేపథ్యంలో భద్రతా కారణాల దృష్ట్యా ట్రంప్ ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారిక వర్గాలు వెల్లడించాయి.

**అంత్యక్రియల్లో నినాదాలు..**

ట్రంప్ తొలి దఫా అధికారంలో ఉన్న సమయంలో ఇరాన్ సైనికాధికారి ఖాసిం సులేమానీ హత్యకు గురయ్యారు. ఈ ఘటన వెనుక అమెరికా హస్తం ఉందని టెహ్రాన్ ఎప్పటి నుంచో ఆరోపిస్తోంది. అందుకు ప్రతీకారం తీర్చుకుంటామని చెబుతోంది. ఈ క్రమంలో ఆ మధ్య జరిగిన అమెరికా అధ్యక్ష ఎన్నికల సమయంలో ట్రంప్‌పై హత్యాయత్నం జరిగిన సంగతి తెలిసిందే. ఇది ఇరానే చేయించిందని నాడు ఆరోపణలొచ్చాయి. ఇక, ఈ ఏడాది ఫిబ్రవరిలో అమెరికా-ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో సుప్రీం లీడర్ ఖమేనీ మరణించడంతో ట్రంప్‌పై ఇరాన్ ప్రజలు మరింత రగిలిపోతున్నారు. ఇటీవల ఖమేనీ అంతిమయాత్ర సమయంలోనూ ఖమేనీ మద్దతుదారులు 'ట్రంప్‌ను చంపేస్తాం' అంటూ నినాదాలు చేయడం గమనార్హం.

**నెతన్యాహుతో ట్రంప్ చర్చలు..**

ఇరాన్‌తో కాల్పుల విరమణ ఒప్పందం విషయంలో ట్రంప్-నెతన్యాహు మధ్య విభేదాలు తలెత్తాయి. తమను సంప్రదించకుండానే అగ్రరాజ్యం.. టెహ్రాన్‌తో డీల్ కుదుర్చుకుందని ఇజ్రాయెల్ ఆరోపించడం వివాదాస్పదమైంది. ఈ క్రమంలోనే తాజాగా ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహుతో ట్రంప్ చర్చలు జరపడం గమనార్హం. గురువారం వీరిద్దరూ ఫోన్‌లో మాట్లాడుకున్నారు. గల్ఫ్ దేశాల్లో తాజా పరిణామాలు, ఇరు దేశాల మధ్య సహకారం గురించి వీరు చర్చించుకున్నట్లు సమాచారం.

## ధాన్యం గోతాలు నేరుగా రైతులకే..

హయాంలో 2023-24లో రూ. 9,312 కోట్ల విలువైన 42.61 లక్షల టన్నులే సేకరించి.. 6-9 నెలలకు చెల్లించారని విమర్శించారు. సీఎంఆర్ విషయంలో కొందరు మిల్లర్లు చేస్తున్న అవకతవకలు వ్యవస్థకే మచ్చగా మారుతున్నాయని పేర్కొన్నారు. సమావేశంలో రైతులు, మిల్లర్లతోపాటు వ్యవసాయ మిషన్ వైస్‌ఛైర్మన్ మర్రెడ్డి శ్రీనివాసులరెడ్డి, పౌరసరఫరాల సంస్థ ఛైర్మన్ తోట సుధీర్, పౌరసరఫరాల శాఖ కమిషనర్ కన్నబాబు, సంస్థ ఎండీ ఢిల్లీరావు, డైరెక్టర్ శ్రీవాస్ నూపుర్ అజయ్‌కుమార్, రైస్‌మిల్లర్ల సంఘం అధ్యక్షుడు గుమ్మడి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## తెలుగు వైభవాన్ని ప్రపంచానికి చాటాలి

శత జయంతి ఉత్సవాల సందర్భంగా ఈ నెల 11, 12 తేదీల్లో కేబీఎన్ కళాశాలలో ఈ మహాసభలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అంతర్జాతీయ తెలుగు రచయిత్రుల మహాసభల అధ్యక్ష కార్యదర్శులు గుత్తికొండ సుబ్బారావు, జి.వి.పూర్ణచందు మాట్లాడుతూ.. రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు ఇతర రాష్ట్రాలు, దేశాలకు చెందిన 50 మంది సీనియర్ రచయిత్రులకు విదుషీమణి పురస్కారాలు అందించి గౌరవించనున్నట్లు చెప్పారు.

## అభ్యంతరకర వ్యాఖ్యలు చేస్తే ఉపేక్షించవద్దు

సోషల్ మీడియాలో ఫేక్ వార్తల నియంత్రణకు హోంశాఖ, న్యాయ శాఖ కలిసి పనిచేయాలన్నది డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అభిమతమని మంత్రి నాదెండ్ల మనోహర్ చెప్పారు. వాట్సప్ యూజర్ నేమ్ అందుబాటులోకి వస్తే సోషల్ మీడియా సమస్యలు అధికమవుతాయని డీజీపీ హరీశ్‌గుప్తా అభిప్రాయపడ్డారు. సైబర్ క్రైమ్ సమస్యల పరిష్కారం కోసం ఐజీ స్థాయి అధికారిని నియమించాలని సీఎం ఆదేశించారు.

## 2, 4వ సెమిస్టర్ పరీక్ష ఫలితాలలో టిఆర్ఆర్ విద్యార్థుల విజయకేతనం



**(షణ్ముఖ వెలుగు, కందుకూరు, జులై 10)**

టిఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల (స్వయం ప్రతిపత్తి) కందుకూరు కళాశాల 2వ సెమిస్టర్, 4వ సెమిస్టర్ ఫలితాలను శుక్రవారం విడుదల చేయడం జరిగింది. 2వ సెమిస్టర్ నందు బిఏ 85% బీఎస్సీ 83% బీకాం 90% తో ఉత్తీర్ణత సాధించడం జరిగింది. 4వ సెమిస్టర్ నందు బిఏ 87% బీఎస్సి 91% బీకాం 92% ఉత్తీర్ణత సాధించడం జరిగింది. నాలుగో సెమిస్టర్ ఫలితాల్లో టి త్రివేణి, సిహెచ్ భవాని, కే పరిమళ, సిహెచ్ కార్తీక్, దాసరి రమ్య, ఎన్ జాన్ బాబు, సిహెచ్ గాయత్రి, ఎస్‌కె సునయన, కె శామ్యూల్ అత్యద్భుత ప్రతిభ చూపించారని తెలియజేశారు. అదే విధంగా రెండవ సెమిస్టర్‌లో వి అహల్య, ఎం శిరీష, ఎన్ అనూష, బి శ్రావణి, వి రాఘవేంద్ర, జె శ్రీనివాస్, పి నయోమి, కే మహేశ్వరి, ఎన్ వెంకటేశ్వర్లు, ఎల్ మధుమతి, ఎం మేఘన, కే లోహిత, కే హర్షిత, కే సందీప్ ప్రతిభ కనబరిచారని ప్రిన్సిపాల్ తెలియజేశారు. ఈ సందర్భంగా అధ్యాపకులను, విద్యార్థులను ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం రవి కుమార్ అభినందించారు. టిఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల (స్వయం ప్రతిపత్తి) విద్యార్థినీ, విద్యార్థులలో ఉన్నటువంటి నైపుణ్యాలను వెలికి తీసి వాటిని మెరుగుపరిచి వారు భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు ఎదగడానికి దోహదపడే విద్యను అందిస్తుందని ప్రిన్సిపాల్ తెలియజేశారు. కందుకూరు, పరిసర ప్రాంత విద్యార్థిని విద్యార్థులు టిఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేరి తమ బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని ఆయన తెలియజేశారు. 2026-27 విద్యా సంవత్సరానికి గాను అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమైందని, విద్యార్థినీ విద్యార్థులు వెంటనే కళాశాలలో సంప్రదించాలని తెలియజేశారు.

## ఏపి ఎలక్ట్రిసిటీ కార్పొరేషన్ ఇంటర్ సర్కిల్ బాల్ బ్యాడ్మింటన్ చెస్, క్యారమ్స్ టోర్నమెంట్‌లో ప్రతిభ



**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 10)**

ఏపి ఎలక్ట్రిసిటీ కార్పొరేషన్ ఇంటర్ సర్కిల్ బాల్ బ్యాడ్మింటన్ చెస్, క్యారమ్స్ టోర్నమెంట్ 2026-2027 నెల్లూరు నందు 7, 8, 9 జూలై నెలలో జరిగినవి. ఈ టోర్నమెంట్‌లో బాల్ బ్యాడ్మింటన్ ద్వితీయ బహుమతి ఆపరేషన్ సర్కిల్ ఒంగోలు వారు సాధించారు. వారిని ప్రెసిడెంట్ స్పోర్ట్స్ కౌన్సిల్ ఒంగోలు, సూపరింటెండెంట్ ఇంజనీర్ కట్ట వెంకటేశ్వర్లు, ఒంగోలు స్పోర్ట్స్ జనరల్ సెక్రెటరీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ హరిబాబు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు జిల్లా స్పోర్ట్స్ సెక్రెటరీ ఎస్‌కె సుభాని, గేమ్ సెక్రటరీ మల్లికార్జునరావు, బాల్ బ్యాట్మెంటన్ టీం ప్లేయర్స్ పున్నారెడ్డి, వీరాంజనేయులు, శ్రీనివాసులు, చెన్నకేశవులు, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

**(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, జులై 10)**


ఆదివారం 33/11కేవీ ఉలవపాడు సబ్ స్టేషన్ కు సంబంధించిన 11కేవీ ఉలవపాడు ఫీడర్స్ మరమ్మతు నిమిత్తం ఉలవపాడు, కొల్లూరుపాడు గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిలిపివేయబడుతుందన్నారు. కావున వినియోగదారులు ఈ అంతరాయానికి సహకరించాలని సింగరాయకొండ సబ్ డివిజన్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఓ ప్రకటనలో కోరారు.



## పొదిలి మండల వెలుగు ఏపిఎం గా కోటేశ్వరమ్మ

**(షణ్ముఖ వెలుగు, పొదిలి, జులై 10)**

పొదిలి మండల వెలుగు ఏపిఎం గా వి కోటేశ్వరమ్మ శుక్రవారం తన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈమె టంగుటూరు మండలం ఆలకూరపాడులో క్లస్టర్ సిసిగా పని చేస్తున్నారు. ప్రభుత్వం సెర్ప్ ఉద్యోగులకు సీనియరిటీ ప్రకారం కల్పించిన పదోన్నతిలో ఆమె ఎపిఎంగా నియమితులయ్యారు.


ప్రకాశం


మార్కాపురం


బాపట్ల

షణ్ముఖ
# వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు · తెలుగు దినపత్రిక

11.07.26 శనివారం


## ఎంపీడీవో కార్యాలయంలో నియోజకవర్గస్థాయి పీజీఆర్ఎస్ కార్యక్రమం

**పిజిఆర్ఎస్‌కు 229 అర్జీలు**

**రెవిన్యూకు సంబంధించినవి 204**






**(షణ్ముఖ వెలుగు, హనుమంతునిపాడు, జూలై 10)**

మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి పీజీఆర్ఎస్ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి, జాయింట్ కలెక్టర్ పి శ్రీనివాసులతో కలిసి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ (తరువాయి 4లో...)

# నీళ్ళివ్వలేని కూటమి ప్రభుత్వం

**20 రోజులు దాటుతున్నా సాగర్ నీరు దిక్కు లేదు**

**గత్యంతరం లేక రోడ్డెక్కి బిందెలతో నిరసన**

**పోలీసుల జోక్యంతో సద్దుమణిగిన ప్రజానీకం**



**(షణ్ముఖ వెలుగు, పొదిలి, జూలై 10)**

కూటమి ప్రభుత్వంలో ప్రజలకు మంచినీళ్ళు ఇచ్చే దిక్కులేని పరిస్థితి వచ్చింది. మండలంలో గుక్కెడు నీటికోసం ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. మండలం, పట్టణంలో ఎక్కడ ఏ ఒక్కరిని కదిలించినా మాకు ఏమీ అవసరం లేదు తాగునీటిని సరఫరా చేస్తే చాలు అనే స్థితిలోకి ప్రజలు వచ్చారంటే పరిస్థితి ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. ఉన్న సాగరునీరు సుమారుగా 10 రోజుల నుండి 20 రోజులకు కూడా రావడంలేదంటూ ప్రజలు రోడ్డెక్కుతున్నారు. ఏమిటి అని అడిగేవారు కరువయ్యారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమస్య పరిష్కరించేందుకు కూటమి ప్రభుత్వంలో ఏ అధికారి, ఏ నాయకుడు, ఏ ప్రజా ప్రతినిధి ముందకు రావడంలేదని పలువురు మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎంతమంది అధికారులకు, నాయకులకు సుమారుగా పదుల సంఖ్యలో సమస్య పరిష్కరించాలని వేడుకున్నా ఎవరు పట్టించుకున్న పాపానపోలేదని నగరంపంచాయతీ పరిధిలోని కంభాలపాడు ఎస్సీ కాలనీవాసులు భోరుమన్నారు. గత్యంతరం లేక శుక్రవారం ఖాళీ బిందెలతో జాతీయ రహదారి పై రాస్తారోకో నిర్వహించారు. తాగునీటి సమస్యకు పరిష్కారం చూపేంతవరకు ఇక్కడ నుండి కదిలేది లేదంటూ భీష్మించుకుని నినాదాలు చేస్తూ గంటకు పైగా ధర్నా నిర్వహించారు. ఈ క్రమంలో సుమారు కిలోమీటరు పైగా ట్రాఫిక్ నిలిచిపోయింది. సమాచారం తెలుసుకున్న పొదిలి ఎస్ఐ సూరెడ్డి రాజేష్ సంఘటనా స్థలానికి చేరుకొని సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవాలని సూచించారు. ఎన్నిసార్లు తాగునీటి సమస్యతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కుంటున్నామని ఎంత మంది అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులకు చెప్పినా ఎవరు పట్టించుకోవడం లేదని కాలనీ వాసులు ఎస్ఐ దృష్టికి తీసుకొళ్ళారు. నీటిసమస్యతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని అధికారులకు, నాయకులకు ఎవరికి చెప్పినా సమాధానం లేదని తెలిపారు. తాగునీరు వచ్చి ఇప్పటికి ఆరు నెలలు అయిందని తెలిపారు. అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరించే విధంగా చూస్తానని ఎస్ఐ హామి ఇవ్వడంతో కాలనీ వాసులు రాస్తారోకో విరమించారు.



# మార్కాపురం ఓఎస్‌డిగా బాధ్యతలు స్వీకరించిన నవజ్యోతి మిశ్రా




**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, జూలై 10)**

నూతన మార్కాపురం జిల్లా ఓఎస్డిగా నవజ్యోతి మిశ్రా శుక్రవారం సాయంత్రం తన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈయన అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లి అడిషనల్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్‌గా పని చేస్తూ ఇక్కడికి బదిలీ పై వచ్చారు. 2021 ఐపిఎస్ బ్యాచ్ కి చెందిన ఈయన స్వస్థలం బీహార్ రాష్ట్రం. నూతన ఓఎస్డిగా బాధ్యతలు స్వీకరించిన నవ జ్యోతి మిశ్రాను డీఎస్పీ డాక్టర్ యు నాగరాజు, సీఐ ఎస్‌కె అల్తాఫ్ హుస్సేన్, ఎస్ఐలు మర్యాదపూర్వకంగా కలసి బొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

# భూసేకరణ ప్రక్రియ వేగవంతం చేయాలి

**జిల్లా కలెక్టర్ పి రాజాబాబు**



**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, జూలై 10)**

ఇండోసోల్ పరిశ్రమకు అవసరమైన భూముల సేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ పి రాజాబాబు స్పష్టం చేశారు. దీనికి సంబంధించిన పురోగతిపై శుక్రవారం ప్రకాశం భవనంలో జాయింట్ కలెక్టర్ శ్రీమతి కల్పనాకుమారి, కందుకూరు సబ్ కలెక్టర్ డి హిమవంశి, ఇతర అధికారులతో కలిసి ఆయన ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. భూములు ఇచ్చేందుకు తొలుత సుముఖత వ్యక్తం చేసి, ప్రస్తుతం ముందుకు రాకపోవడానికి కారణాలపై కలెక్టర్ ఆరా తీశారు. పరిహారం చెల్లింపులో జాప్యానికి కారణాలపైనా చర్చించారు. కాగా, సంబంధిత అంశాలను, ఇప్పటివరకు సేకరించిన భూమి, పెండింగ్ వివరాలను అధికారులు ఆయనకు వివరించారు. దీని పై కలెక్టర్ స్పందిస్తూ భూ యజమానులతో మరోసారి మాట్లాడాలని అవసరమైతే కంపల్సరీ అవార్డు అమలు చేయాలని చెప్పారు. ఆయా విషయాలపై రాష్ట్ర ప్రభుత్వానికి కూడా లేఖ రాస్తామన్నారు. ఈ సమావేశంలో భూసేకరణ డిప్యూటీ కలెక్టర్లు నాగిరెడ్డి, నాసరయ్య, ఇండోసోల్ కంపెనీ కన్సల్టెంట్ ఐవి రెడ్డి, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ మదన్, ఉలవపాడు తహసిల్దార్ రవిశంకర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.



**(షణ్ముఖ వెలుగు, పుల్లలచెరువు, జూలై 10)**

మండలంలో ప్రభుత్వ భూములు, రహదారులు, కాలువలపై ఆక్రమణలు జరుగుతున్నాయంటూ స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రజల రాకపోకలకు, వర్షపు నీటి పారుదలకు ఉపయోగపడే ప్రభుత్వ స్థలాలను కొందరు భూయజమానులు ఆక్రమిస్తున్నారని ఆరోపిస్తూ, సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. స్థానికుల కథనం ప్రకారం, మండల కేంద్రంలోని రామానాయుడు చెరువు అలుగు సమీపంలో ఉన్న ఓ వ్యవసాయ భూమి వద్ద పొలం హద్దులు దాటి రహదారి వైపు మట్టిని తోలించినట్లు ఆరోపణలు ఉన్నాయి. దీంతో రహదారి వెడల్పు తగ్గి వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయని వారు చెబుతున్నారు. ఈ విషయంపై అధికారులు సర్వే నిర్వహించి వాస్తవ పరిస్థితిని నిర్ధారించాలని గ్రామస్తులు కోరుతున్నారు. అలాగే, 2010లో గ్రామ పంచాయతీ తాగునీటి అవసరాల కోసం ఏర్పాటు చేసిన మంచినీటి బోరు ప్రస్తుతం వ్యక్తిగత వినియోగంలో ఉందని కూడా కొందరు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. దీనిపై సంబంధిత శాఖలు విచారణ జరిపి వాస్తవాలను ప్రజలకు వెల్లడించాలని వారు కోరుతున్నారు. ఇక పుల్లలచెరువు--వినుకొండ ప్రధాన రహదారిలోని నక్కలబోడు వాగు సమీపంలో రోడ్డు పక్కనున్న వర్షపు నీటి కాలువను పూడ్చివేసి వ్యవసాయ భూమిలో కలిపినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. దీంతో వర్షాకాలంలో నీటి సహజ ప్రవాహానికి ఆటంకం ఏర్పడి రహదారిపై నీరు నిలిచిపోయే అవకాశం ఉందని వారు

**పుల్లలచెరువులో రహదారులు, కాలువల పై ఆక్రమణలు**


**రెవిన్యూ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికుల ఆవేదన**



# రోడ్డును కూడా మింగేస్తారేమో?




## మనం పద్మ చక్ర సేవా విభూషణ్ జాతీయ అవార్డ్ 2026కు ఎన్నికైన ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగా టీచర్ బి యస్ నారాయణరెడ్డి



(షణ్ముఖ వెలుగు, మైదుకూరు, జులై 10)
గత 30 సంవత్సరాలుగా స్వచ్ఛందంగా సేవ చేస్తున్నటువంటి ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగా టీచర్ బియస్ నారాయణరెడ్డి సంఘ సేవకులు ప్రథమ స్వాతంత్ర్య సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి ఫౌండేషన్ జిహెచ్ఏ ఆర్‌సిసిపి సిఐ హ్యూమన్ రైట్స్ గౌరవ అధ్యక్షులకు మనం పద్మ చక్ర సేవా విభూషణ్ జాతీయ అవార్డ్ 2026 కు ఎన్నికయ్యారు. నూతనంగా గ్లోబల్ అక్రిడిటేషన్ కౌన్సిల్ జర్మనీ ఇంటర్నేషనల్ పీస్ యూనివర్సిటీ వారిచే ఊటీలో గౌరవ డాక్టరేట్ కూడా అందుకోవడం జరిగింది. పలు రకాల సేవా కార్యక్రమాల్లో భాగంగా ప్రధానమైనటువంటిది అనాథ శవాలకులకు అంత్యక్రియలు నిర్వహించటం అనారోగ్యంతో బాధపడుతూ ఉండేటువంటి వారికి ఆసుపత్రికి తీసుకెళ్లి సేవలందించడం ఆధరణ లేని వృద్ధులకు ఆశ్రమాల్లో చేరిపించటం ఎలాంటి ఆదరణ లేని విద్యార్థిని విద్యార్థులకు దాతల సహాయంతో పుస్తకాలు అందించటం ప్రతి సోమవారం గిద్దలూరు లోని కాశినాయన ఆలయం నందు పేదల కోసం దాతల సహాయంతో భోజనం ఏర్పాటు చేయడం ఇంకా వేరువేరు సేవా కార్యక్రమాలు చేస్తున్నందున ఈ అవార్డ్ ను ప్రకటించిన మనం ఫౌండేషన్ కడపగండ్ల డాక్టర్ చక్రవర్తికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని బి యస్ నారాయణరెడ్డి తెలిపారు ఈ అవార్డ్ ని గౌరవ పెద్దల చేత 11వ తేదీ శనివారం ఉదయం 10,30 కి హైదరాబాదులోని త్యాగరాయ జ్ఞానసభ కళా దీక్షితుల్ హాల్ చిక్కడపల్లి తెలంగాణ నందు అవార్డ్ అందుకోవాల్సి ఉందన్నారు.

## ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆర్థిక భరోసా







(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 10)
పేద మధ్యతరగతి ప్రజానీకానికి ఆరోగ్య సమస్యలు తలెత్తినప్పుడు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆర్థిక భరోసా కల్పిస్తున్నామని స్థానిక ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌రావు అన్నారు. నగరంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. 19 మందికి రూ.35 లక్షల పై చిలుకు చెక్కులను అందించడం జరిగిందన్నారు. రెండు సంవత్సరాల కాలంలో రూ.21 కోటి, ఒక లక్ష రూపాయలు పైన ఇప్పటివరకు అందించడం జరిగిందని, ఇంకా ఎవరైనా వైద్య ఖర్చులకోసం అవసరమైతే దరఖాస్తులు స్థానిక నాయకులు ద్వారా చేసుకోవాలని అన్నారు. ప్రభుత్వం వైద్యానికి ఆరోగ్య భద్రతకు పెద్దపీట వెస్తుందని అందులో భాగంగానే ఈ చెక్కులు పంపిణీ కార్యక్రమం జరుగుతుందని అన్నారు. అవసరమైన ప్రతి ఒక్కరు కూడా ఈ అవకాశాన్ని సద్విని చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ రాచగర్ల వెంకట్రావు, టిడిపి నగర పార్టీ అధ్యక్షులు బండారు మదన్, బొడ్డపాటి వెంకట్, గడ్డం ఆది నారాయణ, తదితరులు ఉన్నారు.

## రోడ్డును కూడా మింగేస్తారేమో?



ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ రహదారులు, కాలువలు, చెరువుల అలుగులు, పంచాయతీ ఆస్తులపై ఆక్రమణలు కొనసాగితే భవిష్యత్తులో వరదలు, నీటి నిల్వ సమస్యలు, రాకపోకలకు అంతరాయం వంటి ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని గ్రామస్తులు హెచ్చరిస్తున్నారు. రెవెన్యూ, పంచాయతీరాజ్, ఇరిగేషన్ శాఖలు సంయుక్తంగా సర్వే నిర్వహించి, వాస్తవాలను నిర్ధారించి, నిబంధనల ప్రకారం అవసరమైన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

## ఎంపీడీవో కార్యాలయంలో నియోజకవర్గస్థాయి పీజీఆర్ఎస్ కార్యక్రమం





అర్జీదారుల సమక్షం లోనే సమస్యను స్పష్టంగా తెలియజేసి పరిష్కారం చేయాలన్నారు. రీ సర్వేలో తప్పుల పై ఎక్కువ అర్జీలు వస్తున్నాయని, దీని పై మండల సర్వేయర్లు దృష్టి పెట్టాలన్నారు. రెవెన్యూ సమస్యల పరిష్కార విషయంలో ప్రజల సంతృప్తి మేరకు అధికారులు పని చేయడం లేదన్నారు. సమయం తీసుకుని ప్రతి అర్జీని పరిష్కరిం చేందుకు ప్రత్యేక చొరవ చూపాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ పీజీఆర్ఎస్ కార్యక్రమంలో మొత్తం 229 అర్జీలు రాగా వాటిలో రెవెన్యూ సంబంధించినవి 204, ఇతర సమస్యల పై 25 అర్జీలు వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కనిగిరి ఆర్డీవో అజయ్ కుమార్, హౌసింగ్ పీడీ మోహన్‌రావు, వ్యవసాయ శాఖ జిల్లా ఇన్చార్జి అధికారి బాలాజీ నాయక్, జిల్లా రవాణాశాఖ అధికారి రాంబాబు, డ్వామా పీడి సువార్త, మైక్రో ఇరిగేషన్ పీడీ జెన్నెమ్మ, ఐసిడిఎస్ ఇంచార్జి పీడీ పద్మావతి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ఎస్సీ, ఎస్టీ యాక్ట్ అమలు పై జిల్లా ఎస్పీతో చర్చించిన దళిత నేత నీలం నాగేంద్రరావు

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూలై 10)
ఎస్సీ, ఎస్టీ కేసులను కట్టకుండా కట్టిన ఫాల్స్ గా రిఫర్ చేస్తూ కౌంటర్ కేసులు పెట్టిస్తున్న ఒంగోలు డిఎస్పి రాయపాటి శ్రీనివాసరావుకు ఎస్సీ, ఎస్టీ, కేసులు ఇన్వెస్టిగేషన్ ఇవ్వవద్దని వేరే డిఎస్పికి ఇవ్వాలని దళిత హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షులు నీలం నాగేంద్రరావు జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు కు ఫిర్యాదు చేశారు. శుక్రవారం జిల్లా ఎస్పీ బంగ్లాలో ఎస్పీ హర్షవర్ధన్ రాజును మొదటిసారిగా కలిసి జిల్లాలో ఎస్సీ, ఎస్టీ యాక్ట్ అమలవుతున్న తీరు ఎస్ఐలు, సీఐలు ఎస్సీ, ఎస్టీ కేసులు కట్టకుండా అలసత్వం వహించడం సకాలంలో చార్జ్‌షీట్‌లు కోర్టులో వేయకపోవడం పై పలు ఫిర్యాదులు చేశారు. ఒంగోలులో మేళం శాంతి వర్ధన్ తన మైనర్ చెల్లెలను కొంత మంది పోకిరీలు లైంగికంగా వేధిస్తున్నారని 2024 డిసెంబర్ 31వ తేదీన ఫిర్యాదు చేసినా కేసు నమోదు కాలేదన్నారు. తరువాత విచారణ పేరిట అప్పటి తాలూకా సిఐ అజయ్ కుమార్, ఒంగోలు డిఎస్పి రాయపాటి శ్రీనివాసరావులు నెల రోజుల పాటు విచారణ పేరుతో బాధితులను వేధించారన్నారు. కేసు రాజీ చేసుకోవాలని లేకుంటే కౌంటర్ కేసు పెడతామని బాధితులను బెదిరించారని నాగేంద్ర తెలిపారు. ఈ క్రమంలో ఫిబ్రవరి 3వ తేదీన ఒంగోలు టూ టౌన్ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్షన్‌కి వచ్చిన గుంటూరు ఐజి సర్వ శ్రేష్ట త్రిపాటికి బాధితులు ఫిర్యాదు చేయగా ఐజి ఆదేశాల మేరకు ఒంగోలు డిఎస్పి ఫోక్సో, ఎస్సీ, ఎస్టీ కేసు కట్టించి కౌంటర్ కేసుగా ముద్దాయిలలో ఒకరి తల్లి అయిన దేవరపల్లి అరుణ చేత ఫిర్యాదుదారు మేళం శాంతి వర్ధన్, అండగా నిలబడిన దళిత నాయకుల పై క్రైమ్ నెంబర్ 57/25 గా కౌంటర్ కేసు కట్టించారన్నారు. దీని పై తాము మరలా కౌంటర్ కేసు రద్దు చేయాలని ఫోక్సో కేసులో చార్జ్ షీట్ వేయాలని జిల్లా ఎస్పీ గ్రీవెన్స్ సెల్, గుంటూరు ఐజికి ఫిర్యాదు చేశామన్నారు. కానీ ముద్దాయిలు తెలుగుదేశం పార్టీ కి చెందిన వారైనందున 18 నెలలైనా సదరు దళిత బాలిక కోర్టులో సాక్ష్యం చెప్పినా ఒంగోలు డిఎస్పీ ఈ కేసును ఒంగోలు ఎమ్మెల్యే కనుసన్నల్లో ఫాల్స్ గా రెఫర్ చేసినట్లు తెలుస్తుందన్నారు. అలాగే నాగులుప్పలపాడు పోలీస్ స్టేషన్లో నమోదైన కందుల ప్రవీణ్ అను దళిత యువకుని బలవన్మరణం, ఎస్సీ, ఎస్టీ కేసులో ముద్దాయిలైన వాక హరిణి, లక్ష్మి, యామిని చౌదరి, వాక తిరుమలరావు అను వారిని 18 నెలలైనా అరెస్ట్ చేయలేదన్నారు. హైకోర్టులో కేసు వేసిన ఫోన్ కాల్ డేటా కొరకు ఎఫ్ఎస్ఎల్ కు పంపించామని కోర్టులో కౌంటర్ వేసి తీరా చూస్తే వాట్సప్, మెయిల్ ఆధారాలతో కట్టిన ఎస్సీ, ఎస్టీ కేసును కూడా ఒంగోలు డిఎస్పి రాయపాటి శ్రీనివాసరావు ఫాల్స్‌గా రెఫర్ చేశారన్నారు. ముద్దాయిలు తెలుగుదేశం పార్టీకి చెందిన వారు కాబట్టి మరల ఒంగోలు ఎమ్మెల్యే కనుసన్నల్లో ఈ కేసు కూడా ఒంగోలు డిఎస్పి రెఫర్ చేయించారన్నారు. అలాగే టంగుటూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని పొందూరులో 2022వ సంవత్సరంలో కట్ట ఆదినారాయణ, తదితర మాల కులస్తుల పై భూమి విషయంలో బీసీ, ఓసి కులాలు దాడి చేయగా ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు అయిందన్నారు. తరువాత మరలా ఈ కేసులో రాజీకి రావాలని ఫిర్యాదుదారుడైన కట్ట ఆదినారాయణ ను గత సంవత్సరం జూన్ 10వ తేదీన ఈ కేసులో అగ్రకుల ముద్దాయిలు మరల దాడి చేశారన్నారు. ఈ ఘటన 134/25 టంగుటూరు పోలీస్ స్టేషన్లో కేసు నమోదు అయిందన్నారు. అంతట ఒంగోలు డిఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు కనుసన్నల్లో టంగుటూరి ఎస్ఐ నాగమల్లేశ్వరరావు 135/25గా కౌంటర్ కేసు బాధితుడు కట్ట ఆదినారాయణ, దళిత నాయకుడు పై కేసు నమోదు చేయించారన్నారు. ఈ విధంగా ఒంగోలు డిఎస్పి రాయపాటి శ్రీనివాసరావు ఎస్సీ, ఎస్టీ కేసులకు కౌంటర్ కేసులు పెట్టిస్తూ ఎస్సీ, ఎస్టీ కేసులు కట్టకుండా కట్టిన కౌంటర్ కేసులు కట్టిస్తూ విచారణలో ఫోక్సో, ప్రాణాలు పోయిన దళితుల కేసులను తన విశేషమైన 30 సంవత్సరాల సర్వీసు ఎక్కువ కాలం ఒంగోలులోనే గడిపిన శ్రీనివాసరావు ఎస్సీ, ఎస్టీ కేసులను కమ్మగా తీసివేస్తున్నారన్నారు. ఒంగోలు సబ్ డివిజన్ పరిధిలో నమోదైన ఎస్సీ, ఎస్టీ కేసులు, కౌంటర్ కేసులు, ఛార్జ్ షీట్ ఫైల్ అయిన కేసుల పై ప్రత్యేక సమీక్ష జరపాలని ఎస్సీ, ఎస్టీ యాక్ట్‌కు చట్ట ప్రకారం అమలు చేసి ఎస్సీ, ఎస్టీ బాధితులకు న్యాయం చేయాలని ఎస్పీని నీలం కోరారు. ఇటీవల ఒంగోలు తాలూకా పోలీస్ స్టేషన్లో నమోదైన గోగుల గురవయ్య క్రైమ్ నెంబర్ 332/26 ఒంగోలు తాలూకా పోలీస్ స్టేషన్ ఎస్సీ, ఎస్టీ కేసులో తాలూకా ఎస్ఐ ఫణిభూషణ్ ఫోన్ చేసి పిలిపించి బయటకు వెళ్లి మాట్లాడుకోమని పంపించగా అగ్రకుల నిందితులు అర్వపల్లి శ్రీనివాసరావు, ఆంజనేయులు మంగమూరు రోడ్లోకి తీసుకువెళ్లి దాడి చేసి కారుతో గుద్ది హత్యా ప్రయత్నం చేశారన్నారు. అలాగే పేయ్యల తిరుపతిస్వామి అను మాలకులస్తుడు మంగమూరు రోడ్లో అపార్ట్మెంట్ కొనుక్కుంటే నువ్వు ఇక్కడ ఉంటానికి వీలు లేదంటూ అగ్రకుల కమ్మని మహిళలు కుల వివక్ష పాటించి దాడి చేశారన్నారు. తాలూకా పోలీస్ స్టేషన్ నుంచి తాలూకా ఎస్ఐ చౌడయ్య మరో మహిళ ఎస్ఐ వెళ్లినా వాళ్ల మీద కూడా కమ్మని మహిళలు తిరుగుబాటు చేశారన్నారు. కులాభిమానంతో సర్ది చెప్పటానికి వెళ్లిన తాలూకా సిఐ విజయకృష్ణకు కూడా ఎదురు తిరిగారన్నారు ఇంత జరిగినా ఒంగోలు డిఎస్పి ఆదేశాలతో తాలూక పోలీస్ స్టేషన్లో కేసు కట్టలేదన్నారు. ఇన్చార్జి సిఐగా వచ్చిన రూరల్ సీఐ మార్టూరు మండలం దేగరమూడిలో అంబేద్కర్ విగ్రహం స్థాపన విషయంలో తెలుగుదేశం ఏజెంట్‌గా నిలిచి దళిత యువకులు ఇద్దరిని రఘురామకృష్ణరాజుకు పీవీ సునీల్ కుమార్ అరికాళ్ళ కోటింగ్ ఇచ్చినట్లే దళిత యువకులకు అరికాళ్ళ కోటింగ్ ఇచ్చిన రూరల్ సీఐ శేషగిరిరావు కూడా కేసు కట్టలేదన్నారు. తాము తాలూకా పోలీస్ స్టేషన్ ముందు ఆందోళన చేసిన తరువాతే క్రైమ్ నెంబర్ 292/26 ఎస్సీ, ఎస్టీ కేసుగా మొక్కుబడిగా కేసు నమోదు చేశారన్నారు. ఈ రెండు ఎస్సీ, ఎస్టీ కేసుల్లో విచారణ అధికారిగా నియమితులైన ఒంగోలు డిఎస్పీని మార్చి దర్శి లేదా మార్కాపురం డిఎస్పీలచే విచారణ జరిపించాలని రిజిస్టర్ పోస్టు ద్వారా తమకు ఫిర్యాదు చేశామని నీలం నాగేంద్రరావు ఎస్పీకి తెలిపారు. సదరు ఫిర్యాదు కాపీలను మరల జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజుకు అందించారు. అలాగే ఎస్సీ, ఎస్టీ అమెండ్మెంట్ యాక్ట్ 2015, 2018 జీవో నెంబర్ 1 ప్రకారం ఎటువంటి విచారణ లేకుండా ఎస్సీ, ఎస్టీ ఫిర్యాదులను ఎఫ్ఐఆర్ చేయాలని ఉన్నతాధికారుల అనుమతి లేకుండా ప్రభుత్వ ఉద్యోగులను అరెస్టు చేయవచ్చని ఎస్పీకి మరల సదరు జీవో కాపీలను అందించారు. అలాగే పోలీస్ అధికారులు పూర్వపు ఐపిసి సెక్షన్లు 120 నుండి 509/9 వరకు గల వాటికి షెడ్యూల్ యాక్ట్ ప్రకారం 3(2)(విఏ) ప్రకారం కేసులు కట్టాలని పూర్వపు ఎస్పి 2020వ సంవత్సరంలో ఇచ్చిన మెమోను ప్రస్తుతం అమలవుతున్న బిఎన్ఎస్ చట్ట ప్రకారం మార్చి మార్కాపురం, ప్రకాశం జిల్లా డిఎస్పీ, సిఐ, ఎస్ఐలకు పంపించి అమలయ్యేలా చూడాలని నీలం ఎస్పీని కోరారు. సానుకూలంగా స్పందించిన జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు పై ఫిర్యాదులన్నిటి పై విచారణ చేస్తామని ఎస్సీ, ఎస్టీ ఆక్ట్ అమలు కోసం తగు ఆదేశాలు జారీ చేస్తామని తెలిపారు. ప్రకాశం జిల్లా ఎస్పీ హర్షవర్ధన రాజును కలిసిన వారిలో మాల మహానాడు జిల్లా అధ్యక్షులు దారా అంజయ్య, కార్యదర్శి కాకుమాను రవి, మాల సభ కార్యదర్శి ఎర్రమల శ్రీనివాసరావు, మేడికొండ మురళి, తదితరులు ఉన్నారు.





## ఓటు పోకుండా ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలి

### ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌రావు

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 10)
సర్ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములై ఓటు పోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌రావు అన్నారు. తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఒంగోలు నియోజకవర్గంలో సర్ సర్వే కార్యక్రమం 72% పూర్తయిందని ఇంకా 28% పూర్తి కాలేదన్నారు. స్థానికంగా ఉన్న అన్ని రాజకీయ పార్టీల నాయకులు బిఎల్ఓలు డ్యూటీ అధికారులకు సహకరించి ప్రతి ఒక్కరికి ఓటు హక్కు ఉండేలాగా చూడాలని అన్నారు. డబల్ ఎంట్రీలు జాగ్రత్తగా పరిశీలించుకోవాలని తెలిపారు. ఇంకా నాలుగు రోజులే మిగిలి ఉందని స్థానిక పార్టీ కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి పూర్తయిందో లేదో తెలుసుకొని పూర్తిగా కాకపోతే వెంటనే వారి అప్లికేషన్లను పెట్టించే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సహకరించాలని కోరారు.

# కనీస వేతనాలు, సామాజిక భద్రత కోసం అంగన్వాడీల ఆగ్రహంతో కలెక్టరేట్ దిగ్బంధం

**వేలాదిగా తరలి వచ్చిన అంగన్వాడీలు**
**సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళతానని పిడి హామీ**
**అంగన్వాడీలను నిర్లక్ష్యం చేస్తే ప్రభుత్వం మూల్యం చెల్లించుకోవాల్సిందే**
**వేతనాలు పెంచేంతవరకు పోరాటం కొనసాగింపు**
**అంగన్వాడీలు హెచ్చరిక**

**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 10)**
రూ.26 వేల కనీస వేతనం, సామాజిక భద్రత అమలు, ఫ్రీ స్కూల్ వ్యవస్థ బలోపేతం తదితర డిమాండ్ల సాధనకోసం జిల్లాలోని అన్ని ప్రాజెక్టుల నుండి వేలాదిగా తరలివచ్చిన అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్లు శుక్రవారం ఒంగోలులో కలెక్టరట్ ను ముట్టడించారు. కలెక్టరేట్‌లోకి ప్రవేశించేందుకు ప్రయత్నించిన వారిని పోలీసులు అడ్డుకోవడంతో గేట్ల వద్ద ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. అనంతరం ప్రధాన ద్వారాల ఎదుట బైఠాయించి నిరసన కొనసాగించారు. అంగన్వాడీల ఆగ్రహంతో కలెక్టరేట్ పరిసరాలు గంటలపాటు దిగ్బంధమయ్యాయి. అంగన్వాడీల కనీస వేతనం సామాజిక భద్రత తదితర డిమాండ్ల సాధన కోసం ఆంధ్రప్రదేశ్ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర వ్యాప్త పిలుపు మేరకు ప్రకాశం భవన్ వద్ద తొలుత ధర్నా చేపట్టారు. జిల్లా అధ్యక్షురాలు సిహెచ్ ఇందిరావతి అధ్యక్షతన జరిగిన ధర్నాలో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈదర అన్నపూర్ణ, సీఐటీయు జిల్లా ప్రధానకార్యదర్శి యం రమేష్, జిల్లా ఉపాధ్యక్షులు జివి కొండారెడ్డి మాట్లాడారు.

అంగన్వాడీల వేతనాలు పెంచకుంటే ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని నాయకులు హెచ్చరించారు. అంగన్వాడీల బ్లాక్ డే ప్రభుత్వాల మనుగడకు బ్లాక్ డే గా మారుతుందన్నారు. ఈ సందర్భంగా అన్నపూర్ణ మాట్లాడుతూ అంగన్వాడీల వేతనాల పెంపు కోసం 42 రోజుల సమ్మె సందర్భంగా అప్పటి ప్రతిపక్ష నేతగా ఉన్న నేటి ముఖ్యమంత్రి అధికారంలోకి వచ్చిన వెంటనే వేతనాలు పెంచుతామని హామీ ఇచ్చినా, ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలు గడిచినా అమలు చేయలేదని విమర్శించారు. రెండు బడ్జెట్లు ప్రవేశపెట్టినప్పటికీ అంగన్వాడీల వేతనాల పెంపుపై చర్చ కూడా జరగకపోవడం మహిళలను మోసం చేయడమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. గుజరాత్ హైకోర్టు అంగన్వాడీ టీచర్లను 3వ తరగతి ఉద్యోగులుగా, హెల్పర్లను 4వ తరగతి ఉద్యోగులు గుర్తించాలని తీర్పు ఇవ్వటమే కాక ఆయా క్యాడర్ల బేసిక్ వేతనం అమలుచేయాలని తీర్పు ఇచ్చిందన్నారు. రాష్ట్రంలోను పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కార్యకర్తలు, హెల్పర్లకు నెలకు రూ.26 వేల కనీస వేతనం అమలు చేసి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని వారు డిమాండ్ చేశారు. పెన్షన్, పీఎఫ్, ఈఎస్ఐ, గ్రాట్యుటీ,




వేతనంతో కూడిన వైద్య సెలవులు సహా అన్ని సామాజిక భద్రతా పథకాలు వర్తింపజేయాలని కోరారు. బీఎల్‌వో తదితర అదనపు విధులు అప్పగిస్తే కేంద్రాలను ఎవరు నిర్వహిస్తారని ప్రశ్నించారు. కేంద్రాల నిర్వహణకు అద్దెలు, విద్యుత్ బిల్లులు, ప్రయాణ వ్యయాలు, అదనపు గ్యాస్ సిలిండర్ల ఖర్చును తమ స్వంత జీతాల నుంచే భరించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. పిల్లలకు కేటాయిస్తున్న బియ్యం, పప్పు, నూనె, కూరగాయల పరిమాణాలు, గ్యాస్ ఖర్చు ప్రస్తుత పరిస్థితులకు ఏమాత్రం సరిపోవడం లేదన్నారు. ప్రైవేట్ పాఠశాలలకు చిన్నారుల తరలింపును అరికట్టేందుకు చట్టం తీసుకురావాలని, పెండింగ్ బిల్లులు చెల్లించి మినీ కేంద్రాలను అప్‌గ్రేడ్ చేయడంతో పాటు ఖాళీ సూపర్‌వైజర్ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీలందరికి ఆదాయ పరిమితితో సంబంధం లేకుండా సంక్షేమపథకాలను అమలుచేయాలన్నారు. అంగన్వాడీలు కలెక్టరేట్‌లోకి వెళ్లేందుకు ప్రయత్నించగా సీఐ కె వెంకటేశ్వరరావు, ఎస్ఐ కె పున్నారావు ఆధ్వర్యంలో పోలీసులు రెండు ప్రధాన గేట్లను మూసివేసి అడ్డుకున్నారు. అనంతరం ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ పద్మ సునంద ఆందోళనకారులను కలిసి సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తానని, పది రోజుల్లో గ్రీవెన్స్ పరిష్కార కమిటీ సమావేశం నిర్వహిస్తానని హామీ ఇచ్చి వినతిపత్రాన్ని స్వీకరించారు. ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు జి శేషయ్య సంఘీభావం ప్రకటించారు. తమ డిమాండ్లు నెరవేరేంత వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని, అంగన్వాడీలను నిర్లక్ష్యం చేస్తే ప్రభుత్వం రాజకీయంగా తగిన మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందని నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు కాలం సుబ్బారావు, జిల్లా నాయకులు సిహెచ్ మజుందార్, జి శ్రీనివాసులు, టి రంగారావు, జి వెంకటేశ్వర్లు, టి రాము, పి ఆంజనేయులు, టి మహేష్, జి రమేష్, తంగిరాల వెంకటేశ్వర్లు, అంగన్వాడీ యూనియన్ జిల్లా ప్రాజెక్టు నాయకలు యన్ ధనలక్ష్మి, జయప్రద, కె హెమీమా, పద్మావతి, శారద, శేషమ్మ, క్రాంతి, రాజేశ్వరి, ఆదిలక్ష్మి, చిన్నమ్మాయి, మస్తాన్ బి, వరలక్ష్మి, తిరపతమ్మ, జయమణిలు, తదితరులు పాల్గొన్నారు.




## మహిళా అదృశ్యం పై కేసు నమోదు

**(షణ్ముఖ వెలుగు, యర్రగొండపాలెం, జులై 10)**
ఓ మహిళ అదృశ్యమైన సంఘటనపై కేసు నమోదు చేసినట్లు యర్రగొండపాలెం ఎస్ఐ ఎం దేవ కుమార్ శుక్రవారం తెలిపారు. ఎస్ఐ ఎం దేవ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం యర్రగొండపాలెం మండలంలోని హనుమంతుని చెంచుగూడానికి చెందిన 31 సంవత్సరాల వయస్సు గల భూమని ఈదమ్మా అనే మహిళ అంగన్వాడి టీచర్‌గా పని చేస్తుంది. గత నెల 28వ తేదీన ఇంట్లో యర్రగొండపాలెం వెళ్లి వస్తానని చెప్పి బయటికి వెళ్లిపోయింది. అప్పటి నుంచి కనిపించడం లేదు. ఎంత వెతికినా ఎక్కడా ఆచూకీ దొరకకపోవడంతో మహిళ తండ్రి భూమని ఈదన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ దేవకుమార్ తెలిపారు.

## కోతముక్క, పేకాట పై పోలీసుల దాడి అదుపులో ఐదు మంది నగదు స్వాధీనం

**చట్ట విరుద్ధ కార్యాకలాపాల పై కఠిన చర్యలు**
**ఎస్ఐ దేవకుమార్**

**(షణ్ముఖ వెలుగు, యర్రగొండపాలెం, జులై 10)**
మండలంలోని వెంకటాద్రిపాలెం గ్రామంలోని పొలాల్లో కొంతమంది వ్యక్తులు కోత ముక్క పేకాట ఆడుతున్నారనే విశ్వసనీయ సమాచారం అందడంతో తక్షణమే పోలీసు బృందంతో కలిసి దాడి నిర్వహించినట్లు యర్రగొండపాలెం ఎస్సై ఎం దేవకుమార్ శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ ఎం దేవకుమార్ మాట్లాడుతూ తమకు అందిన సమాచారం మేరకు సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి వెళ్లి తనిఖీలు నిర్వహించామన్నారు. అక్కడ చట్టవిరుద్ధంగా కోత ముక్క, పేకాట ఆడుతున్న 5 మంది వ్యక్తులను గుర్తించి అదుపులోకి తీసుకున్నామన్నారు. వారి వద్దనుంచి రూ.58,680 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. సంబంధిత వ్యక్తులమ పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## విద్యా ప్రమాణాల అభివృద్ధి లక్ష్యంగా పనిచేయాలి





**(షణ్ముఖ వెలుగు, కంభం, జూలై 10)**
మార్కాపురం జిల్లా కంభం ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాల అభివృద్ధితో పాటు విద్యార్థులకు నాణ్యమైన సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని మండల విద్యాశాఖ అధికారి అబ్దుల్ సత్తార్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని జడ్పీ ఉన్నత పాఠశాల, కందులాపురంలో ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల రికార్డులు, విద్యార్థుల హాజరు నమోదు, తరగతి గదుల నిర్వహణ, ఉపాధ్యాయుల బోధన విధానాలను క్షుణ్ణంగా పరిశీలించారు. విద్యార్థులతో ముచ్చటిస్తూ పఠన,రచన,గణిత, భాషా నైపుణ్యాలను పరీక్షించి, అభ్యసన సామర్థ్యాలను అంచనా వేశారు. పాఠశాల విద్యార్థులు అందరూ ప్రాథమిక అభ్యసన లక్ష్యాలను చేరుకునేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. అనంతరం ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజన పథకం అమలును పరిశీలించారు. విద్యార్థులకు వడ్డిస్తున్న భోజనాన్ని రుచి చూసి నాణ్యత, పరిశుభ్రత, మెనూ అమలును తనిఖీ చేశారు. పోషక విలువలు కలిగిన, రుచికరమైన ఆహారాన్ని అందించేలా వంట సిబ్బంది జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పాఠశాల ఆవరణ పరిశుభ్రత, తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్ల నిర్వహణ, విద్యార్థుల భద్రతా చర్యలు, పచ్చదనం, పరిశుభ్రమైన తదితర అంశాలను పరిశీలించారు. విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి విద్యా నాణ్యతతో పాటు ఆరోగ్యం, పరిశుభ్రత, క్రమశిక్షణకు సమాన ప్రాధాన్యత ఇవ్వాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ తనిఖీలో సిఆర్పీ మురలీమోహన్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు డి వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు, మధ్యాహ్న భోజన సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించడమే ప్రజా దర్బార్ ముఖ్య ఉద్దేశం

**మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి**




**(షణ్ముఖ వెలుగు, మార్కాపురం టౌన్, జులై 10)**
ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించడమే ప్రజా దర్బార్ ముఖ్య ఉద్దేశ్యం అని మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం మార్కాపురం పట్టణంలోని జవహర్ నగర్ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మార్కాపురం నియోజకవర్గ స్థాయి ప్రజా దర్బార్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మార్కాపురం నియోజకవర్గంలోని అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి మాట్లాడుతూ శుక్రవారం ప్రజాదర్బార్‌లో 66 అర్జీలు వచ్చాయన్నారు. వీటిలో ఎక్కువ భాగం రెవెన్యూ సమస్యలు ఉన్నాయని, కొన్ని సమస్యలను ఇక్కడికిక్కడే పరిష్కారం చేశామని, మిగతా వాటికి త్వరలోనే పరిష్కారం అధికారులు చూపుతారన్నారు. ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించడానికి ఈ ప్రజా దర్బార్ ఏర్పాటు చేస్తున్నామని ప్రజలు దానిని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.

## పొదిలి ఎంఈఓకు బివి రెడ్డికి జెవివి నాయకులు ఘన సత్కారం



**(షణ్ముఖ వెలుగు, పొదిలి, జులై 10)**
గురువారం పొదిలి మండల 1 విద్యాశాఖ అధికారిగా పదవి బాధ్యతలు చేపట్టిన బాదం వెంకటేశ్వరరెడ్డిని ఉమ్మడి ప్రకాశం జిల్లా జన విజ్ఞాన వేదిక ఉపాధ్యక్షులు దాసరి గురుస్వామి, కార్యదర్శి బి దేవప్రసాద్ ఆధ్వర్యంలో శుక్రవారం తన కార్యాలయంలో పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాదం వెంకటేశ్వరరెడ్డి గతంలో జన విజ్ఞాన వేదిక కార్యక్రమంలో పాల్గొని చురుకుగా మెరుగైన సేవలు అందించారని, ప్రస్తుతం మండల విద్యాశాఖ అధికారిగా విద్యాశాఖకు ఉన్నతమైన సేవలందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక పొదిలి మండల కార్యదర్శి గోనే శ్రీనివాసులు, ఉపాధ్యక్షులు వెంకటేష్, యుటిఎఫ్ నాయకులు బాల వెంకటేశ్వర్లు, పిఆర్‌టియు నాయకులు గంజి రమణారెడ్డి, బాలకాశిరెడ్డి, పలు ప్రైవేటు విద్యాసంస్థల అధినేతలు పాల్గొని అభినందించి శుభాకాంక్షలు తెలియజేశారు.

## చిన్నగంజాం జేడ్పి హైస్కూల్ తనిఖీ



**(షణ్ముఖ వెలుగు, చిన్నగంజాం, జులై 10)**
మండలంలోని చిన్నగంజాం జేడ్పి హైస్కూలును చీరాల డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ గంగాధర్ శుక్రవారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ తనిఖీలో భాగంగా తరగతి గదిలో విద్యార్థుల హాజరు పరిశీలించారు. సంసిద్ధత కార్యక్రమము అమలు ,అడ్మిషన్లు, మధ్యాహ్న భోజన పథకం అమలు, తదితర అంశాలు తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. గతం సంవత్సరం లాగా చక్కని ఫలితాలు సాధించాలని హెచ్‌ఎం, టీచర్లను అయిన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన ఉపాధ్యాయులు శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యాయులు నరసింహరావు, సిఆర్పి సురేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా స్థాయిలో బిజినెస్ డెవలప్‌మెంట్ ప్లాన్ పై శిక్షణ




**(షణ్ముఖ వెలుగు, మార్కాపురం టౌన్, జులై 10)**

మార్కాపురం జిల్లా స్థాయిలో 2026-27 బిజినెస్ డెవలప్ మెంట్ ప్లాన్ పైన రెండవ రోజు జరుగుతున్న శిక్షణకు ముఖ్య అతిథి వెలుగు డిఆర్‌డిఏ మార్కాపురం జిల్లా అడిషనల్ పిడి సి నీలకంఠారెడ్డి పాల్గొని ప్రతి మండల సమాఖ్యలో మండల సమాఖ్య ఈసి సభ్యులకు బిడిపి పైన శిక్షణ ఇచ్చి అందరూ 2026-27 సంవత్సరంలో మండల సమాఖ్య సీబడ్జెట్ డెవలప్ మెంట్ ప్లాన్ చేసుకొని యన్ఆర్‌యల్‌యం లాగిన్‌లో అప్లోడ్ చేయాలని తెలియజేశారు. ఏపీడి నీలకంఠారెడ్డి మాట్లాడుతూ బిజినెస్ డెవలప్ మెంట్ ప్లాన్ ప్రిపరేషన్ లో ఆరోగ్యం, విద్య, వ్యవసాయం, సామాజిక భద్రత, ఆస్తుల సృష్టి, ప్రవర్తనలో మార్పు, సుస్థిర జీవనోపాదులు, సామర్థ్యాలపెంపు మొదలగు అంశాలకు విజన్, మిషన్, ఆబ్జెక్టివ్, స్ట్రేటజీ, యాక్షన్ ప్లాన్ ప్రకారం ప్రాధాన్యత ఇచ్చి బిజినెస్ డెవలప్ మెంట్ ప్లాన్ చేయాలన్నారు. ఈ రెండు రోజులు శిక్షకులుగా డిపియం లక్ష్మిరెడ్డి, ఎపియం పి రమేష్ బాబు, ఎల్సీఎం వెంకిరెడ్డి వ్యవహరించారు. మార్కాపురం ఎపియం డి పిచ్చయ్య, పది మండలాల ఎపియం లు, సిసిలు, అకౌంటెంట్లు, మార్కాపురం మండల సమాఖ్య ఈసి సభ్యులు పాల్గొన్నారు.

# పోలమ్మ మృతి పట్ల మైదుకూరు మార్కెట్ యార్డ్ చైర్మన్ ఏపీ రవీంద్ర ప్రగాఢ సంతాపం




**(షణ్ముఖ వెలుగు, మైదుకూరు, జులై 10)**

మైదుకూరు నియోజకవర్గ ఎమ్మెల్యే, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు పుట్టా సుధాకర్ యాదవ్ మాతృమూర్తి పుట్టా పోలమ్మ స్వర్గస్థులైన వార్త పట్ల మైదుకూరు మార్కెట్ యార్డ్ చైర్మన్ ఏపీ రవీంద్ర తీవ్ర దిగ్భ్రాంతిని, నివాళులను ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ తన ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తపరిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ ను ఒక ఉన్నతమైన నాయకుడిగా తీర్చిదిద్దిన వారి మాతృమూర్తి పుట్టా పోలమ్మ మరణవార్త నన్ను తీవ్రంగా కలచివేసింది. నియోజకవర్గంలో ఎప్పుడు కలిసినా, ఒక కన్నతల్లిలా ఎంతో ఆప్యాయంగా, అనురాగంతో పలకరించే ఆ చల్లని గొంతు నేడు మూగబోవడం నాతో పాటు నియోజకవర్గ ప్రజలందరినీ తీవ్ర దుఃఖంలో ముంచెత్తింది. ఆమె క్రమశిక్షణ, సేవాభావం, నిరాడంబరత ఎందరికో ఆదర్శం. అమ్మ మన మధ్య లేరనే నిజాన్ని జీర్ణించుకోవడం ఎవరికీ సాధ్యం కావడం లేదు. ఆమె మరణం కేవలం పుట్టా సుధాకర్ యాదవ్ కుటుంబానికే కాకుండా, మైదుకూరు నియోజకవర్గంలోని తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులకు, శ్రేణులకు సైతం తీరని లోటు. మాతృవియోగం అనేది ఏ బిడ్డకైనా భరించలేనిది. ఈ కఠిన సమయంలో ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్‌కు, వారి కుటుంబ సభ్యులకు ఆ దేవుడు కొండంత మనోధైర్యాన్ని ప్రసాదించాలని మనస్ఫూర్తిగా ప్రార్థిస్తున్నాను. స్వర్గస్తులైన అమ్మ పవిత్ర ఆత్మకు ఆ భగవంతుడు సద్గతులు ప్రసాదించి, శాంతి చేకూర్చాలని వేడుకుంటూ వారి కుటుంబానికి నా తరపున, మార్కెట్ యార్డ్ పాలకమండలి తరపున ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను.

# పొదిలి ఏఎంసి అత్యాధునిక చెక్‌పోస్టును ప్రారంభించిన ఏఎంసి చైర్మన్ డాక్టర్ సయ్యద్ ఇమాంసా

**(షణ్ముఖ వెలుగు, పొదిలి, జులై 10)**

పొదిలి ఏఎంసి అత్యాధునిక చెక్‌పోస్టును ఏఎంసి చైర్మన్ డాక్టర్ సయ్యద్ ఇమాంసా శుక్రవారం రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. పొదిలి వ్యవసాయ మార్కెట్ కమిటీ 4వ సాధారణ సమావేశం శుక్రవారం స్థానిక ఏఎంసి కార్యాలయంలో కమిటీ చైర్మన్ సయ్యద్ ఇమామ్ సాహెబ్ అధ్యక్షతన నిర్వహించబడింది. సమావేశంలో కమిటీ ఆదాయ, వ్యయాల పై సమగ్ర సమీక్ష నిర్వహించడంతో పాటు మార్కెట్ కమిటీ ఆదాయాన్ని మరింత పెంపొందించేందుకు చేపట్టాల్సిన చర్యల పై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా చైర్మన్ కమిటీ సభ్యులు, పలు విలువైన సూచనలు, సలహాలు తెలియచేశారు. అనంతరం మార్కాపురం అడ్డరోడ్డు వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన అత్యాధునిక చెక్‌పోస్ట్ కార్యాలయాన్ని చైర్మన్ సయ్యద్ ఇమామ్ సాహెబ్ ప్రారంభించారు. ఈ చెక్‌పోస్ట్‌లో అత్యాధునిక సీసీటీవీ నిఘా వ్యవస్థ, కంప్యూటర్లు, హై స్పీడ్ ఇంటర్నెట్‌తో పాటు ఇతర ఆధునిక సాంకేతిక సౌకర్యాలను ఏర్పాటు చేయనున్నామని తెలియజేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ చెక్‌పోస్ట్ ద్వారా జరిగే వ్యవసాయ



ఉత్పత్తుల రాకపోకలు, మార్కెట్ ఫీజు వసూళ్లు, ఇతర లావాదేవీలు పూర్తి స్థాయి పారదర్శకతతో జరిగేలా సీసీటీవీ నిఘా వ్యవస్థను మరింత బలోపేతం చేయడంతో పాటు అవసరమైన అన్ని సాంకేతిక ఆధునీకరణ చర్యలను చేపట్టాలని కార్యదర్శి వి రవిశంకర్‌రెడ్డిని ఆదేశించారు. అదేవిధంగా 2026 జులై 1 నుండి అమలులోకి వచ్చిన ఈ పర్మిట్ విధానాన్ని సమాచార సాంకేతికతను సమర్థవంతంగా వినియోగిస్తూ పారదర్శకంగా, వేగవంతంగా, రైతులు మరియు వ్యాపారులకు మరింత సౌకర్యవంతంగా అమలు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ డాక్టర్ సయ్యద్ ఇమామ్ సాహెబ్, ఏఎంసి ఉపాధ్యక్షులు పండేటి తిమోతి, సభ్యులు రోళ్ళ శ్రీను, దేవరకొండ రవణమ్మ, షేక్ షహనాజ్, ఇనగంటి శైలజ, చేతుల శ్రీనివాసులు, పువ్వాడ నారాయణమ్మ, మందడి తిరుపతమ్మ, చింత గురవయ్య, తనుబుద్ది లక్ష్మి దేవి, కసిబిసి యర్రయ్య, సోమిశెట్టి శ్రీదేవి , వెంపటి శ్రీకాంత్, కూచిపూడి సోమయ్య, కార్యదర్శి వి రవిశంకర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ సిబ్బంది పాల్గొన్నారు.






# కడప జిల్లా ఆర్యవైశ్య మహిళా సంఘం కార్యవర్గంలో మైదుకూరు పట్టణానికి ప్రాధాన్యం



**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, కడప, జులై 10)**

గురువారం రాత్రి మైదుకూరు అమ్మవారిశాలలో జరిగిన కార్యక్రమంలో జిల్లా ఆర్యవైశ్య మహిళా సంఘం అధ్యక్షురాలు రాజా వెంకట వరలక్ష్మి కడప జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు వల్లంకొండు వెంకటరమణ (రూరల్) ఆదేశాల మేరకు హాజరై పలువురు మహిళలకు నియామక పత్రాలు అందజేశారు. జిల్లా ఆర్యవైశ్య మహిళా సంఘం ఉపాధ్యక్షురాలుగా బల్లాని సునంద నియామకం, మైదుకూరు ఆర్యవైశ్య మహిళా మండల సంఘం అధ్యక్షురాలుగా వంకదారి వాసంతి నియామకం, మైదుకూరు ఆర్యవైశ్య మహిళా మండల సంఘం ఉపాధ్యక్షురాలుగా సూరిశెట్టి మాధవిలత నియామకం జరిగింది. ఈ కార్యక్రమంలో మైదుకూరు ఆర్యవైశ్య సభ అధ్యక్షులు బల్లాని చెన్నకేశప్రసాద్, కడప జిల్లా ఆర్యవైశ్య సంఘం వర్కింగ్ కమిటీ ప్రెసిడెంట్ గురు ప్రసాద్, జిల్లా ఆర్యవైశ్య మహిళా సంఘం అధ్యక్షురాలు రాజా వెంకట వరలక్ష్మి, మైదుకూరు మహిళా సంఘం అధ్యక్షురాలు బల్లాని సునంద, మైదుకూరు మహిళా మండల అధ్యక్షురాలు వంకదారి వాసంతి, మైదుకూరు మండల మహిళా సంఘం ఉపాధ్యక్షురాలు సూరిశెట్టి మాధవిలత, మైదుకూరు మహిళా మండలి సెక్రటరీ ఎల్లనూరు స్వాతి, ఇతర మహిళా మండలి సభ్యులు పాల్గొన్నారు.





# కన్నుల పండుగగా శ్రీ వారి కల్యాణోత్సవం



**(షణ్ముఖ వెలుగు, బద్వేల్, జులై 10)**

బద్వేల్ పట్టణంలోని శ్రీ మహాలక్ష్మీ గోదాదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి శ్రీ అభయ ఆంజనేయ స్వామి దేవస్థానంలో శ్రీవారి ఏకాదశ వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయని ఆలయ ఆలయ ధర్మకర్త వల్లంకొండు వెంకటరమణ, గౌరవ అధ్యక్షులు త్రివిక్రమ్ సింగ్, సెక్రెటరీ అంకయ్య తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం ఆలయ ఆవరణలో చలువ పందిళ్లు నీడన, మంగళ వాయిద్యాల నడుమ అర్చకులు సుదర్శన సోమశేఖర్ స్వామి అర్చక బృందంచే శాస్త్రోక్తంగా వేద మంత్రోచ్చారణతో శ్రీ మహాలక్ష్మీ గోదాదేవి సమేత శ్రీ వెంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాన్ని కన్నుల పండుగగా నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం శ్రీ వారిని గరుడహనంపై కొలువుతీర్చి గజమాలలతో అలంకరించి మంగళవాయిద్యాలతో బద్వేల్ పట్టణ పురవీధుల్లో విహరింపజేశారు. భక్తులు గోవింద నామస్మరణతో స్వామివారికి టెంకాయలు సమర్పించి మొక్కులు తీర్చుకున్న భక్తులను శ్రీవారు కాటాక్షించారు. స్వామి వారి గ్రామోత్సవం వెంబడి శ్రీకృష్ణ కోలాటం మాస్టర్ వెంకీ వారి బృందం పలువురిని ఆకట్టుకునే విధంగా నిలిచాయి. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, ప్రముఖులు, దాతలు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

## కళ్యాణోత్సవంలో పాల్గొన్న అడ్వకేట్ త్రివిక్రమ్ సింగ్ కుటుంబ సభ్యులు







# ఒక్క ఓటు కూడో కోల్పోకుండా జాగ్రత్తలు తీసుకోండి

## బిఎల్ఏ, వార్డు ఇన్‌ఛార్జిలకు సూచించిన మాజీ ఎమ్మెల్యే అన్నా









(షణ్ముఖ వెలుగు, పొదిలి, జులై 10)

అర్హులైన ఏ ఒక్క ఓటు కూడా ఓటర్లు కోల్పోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వైసీపీ పార్టీ బిఎల్ఏ, వార్డు ఇన్‌ఛార్జిలకు మాజీ ఎమ్మెల్యే, మార్కాపురం వైసీపీ ఇన్‌ఛార్జి అన్నా వెంకట రాంబాబు సూచించారు. శుక్రవారం పొదిలి పట్టణంలోని 7, 10, 16 వార్డులతో పాటు విరాట్ నగర్, వైఎస్ఆర్ నగర్, ఇస్లాంపేట, నవాబ్‌మిట్ట, ఎన్‌జిఓ కాలనీ, మసీద్ తోట, నందిపాలెం, మాదిరెడ్డిపాలెం, బుచ్చనపాలెం ప్రాంతాల్లో ఆయన విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా బిఎల్ఏలు, ఆయా వార్డు ఇన్‌ఛార్జిలకు అన్నా రాంబాబు పలు జాగ్రత్తలు తెలియజేశారు. సమయం ఎక్కువగా లేదని 14వ తేదీలోగా



ఇంకా ఎవరైనా ఓటర్లు ఫారాలు బిఎల్ఓలకు అందించకుంటే మీరే దగ్గరుండి వాటిని పూర్తి చేయించి అధికారులకు అందజేయాలని సూచించారు. అర్హత కలిగిన ఏ ఒక్క ఓటరు కూడా తన ఓటు హక్కును కోల్పోకుండా తగిన చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో వైసీపీ రాష్ట్ర కార్యదర్శులు షంషీర్ అలీ బేగ్, కెవి రమణారెడ్డి, మాజీ జడ్పీటిసి సభ్యులు వి సాయిరాజేశ్వరరావు, వైసీపీ నాయకులు కల్లం వెంకట సుబ్బారెడ్డి, గొలమారి చెన్నారెడ్డి, జి శ్రీను, యక్కలి శేషగిరిరావు, మాజీ మండల కోఆప్షన్ మెంబర్ మస్తాన్‌వలి, వెంకటేశ్వరరెడ్డి, శ్రీధర్‌రెడ్డి, సుబ్బారెడ్డి, 10వ వార్డు ప్రెసిడెంట్ రాచర్ల సురేంద్ర, జనరల్ సెక్రటరీలు ఎన్ సూర్యనారాయణ, వై వీరబ్రహ్మం, జి సురేష్ బాబు, వెంగళరెడ్డి, వర్షం ఫిరోజ్, ఇతర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ మాతృమూర్తి కన్నుమూత

## హైదరాబాద్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి
## నేడు ప్రొద్దుటూరులో అంత్యక్రియలు





(షణ్ముఖ వెలుగు, మైదుకూరు, జులై 10)

మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ మాతృమూర్తి పుట్టా పోలమ్మ (80) శుక్రవారం ఉదయం కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె హైదరాబాద్‌లోని పీఆర్‌కే ఆసుపత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో తుదిశ్వాస విడిచారు. ఆమె మృతి పట్ల పలువురు రాజకీయ ప్రముఖులు, నియోజకవర్గ ప్రజలు తీవ్ర విచారం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యే కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నారు. పోలమ్మ పార్థివదేహాన్ని హైదరాబాదులో మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఇతర రాజకీయ ప్రముఖులు సందర్శించి నివాళులర్పించారు.



**ప్రొద్దుటూరుకు పార్థివదేహం :**

పోలమ్మ పార్థివదేహాన్ని హైదరాబాద్ నుండి తరలిస్తున్నారు. శుక్రవారం రాత్రి 8 గంటలకు ప్రొద్దుటూరులోని ఎమ్మెల్యే నివాసానికి పార్థివదేహం చేరుకోనుంది. అభిమానులు, నాయకులు, ప్రజల సందర్శనార్థం రాత్రి నుండి రేపు ఉదయం వరకు అక్కడే ఉంచనున్నారు.

**నేడు అంత్యక్రియలు :**

శనివారం ఉదయం 11 గంటలకు ప్రొద్దుటూరులోని ఎమ్మెల్యే స్వగృహం నుండి అంతిమయాత్ర ప్రారంభమవుతుంది. అనంతరం మదూరు బైపాస్ రోడ్ సమీపంలో ఉన్న ఎమ్మెల్యే వ్యవసాయ క్షేత్రంలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

# వేతనాలు పెంచాలని అంగన్వాడిల డిమాండ్

అంగన్వాడీలకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్
నవచేతన యాప్ రద్దు చేసి, పని ఒత్తిడి తగ్గించాలని నినాదాలు







(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, జులై 10)

అంగన్వాడి జాతీయ కోర్కెల దినోత్సవం సందర్భంగా ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో శుక్రవారం మార్కాపురం ఆర్డీవో ఆఫీస్ ను ముట్టడి నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్వాడీలకు కనీస వేతనం 26 వేలు చెల్లించాలని, కూటమి ప్రభుత్వ హామీ మేరకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అంగన్వాడీలకు అమలు చేయాలని, హెల్త్ డిపార్ట్మెంట్ నవచేతన యాప్ పని అంగన్వాడీల చేత చేయించడాన్నీ మానుకోవాలని, అంగన్వాడీలకు పీఎఫ్, ఈఎస్ఐ, పెన్షన్ ఇవ్వాలని ధర్నాకు హాజరైన ఐసిడిఎస్ పిడి ధనలక్ష్మి వినతిపత్రం అందించారు. ధర్నా అనంతరం కోర్టు సెంటర్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు.అంగన్వాడిలా పోరాటానికి మద్దతుగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గుమ్మ బాలనాగయ్య, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు డి సోమయ్య పోరాటానికి సంపూర్ణం మధ్య తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు టి ఆవులయ్య, మాలకొండయ్య, పి రూబెన్, ఎస్ కె అన్వర్, కే సుబ్బరాయుడు, జె నాగరాజు, అంగన్వాడి యూనియన్ నాయకులు ఎస్ లక్ష్మి, ప్రభావతి, రమా, మల్లేశ్వరి, అరుణకుమారి, బి భారతి, డి స్వర్ణ కుమారి, ఏ మునెమ్మ, శోభారాణి, పెద్దక్క, వెంకట శ్రీలక్ష్మి, స్వప్న, భారతి, లలిత కుమారి, తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్‌చౌర్యానికి పాల్పడితే కేసులు నమోదు
## ఎస్ఈ సయ్యద్ అబ్దుల్ కరీం







(షణ్ముఖ వెలుగు, పొదిలి, జులై 10)

విద్యుత్ చౌర్యానికి పాల్పడితే కేసులు నమోదు చేస్తామని విద్యుత్తుశాఖ జిల్లా ఎస్ఈ సయ్యద్ అబ్దుల్ కరీం హెచ్చరించారు. శుక్రవారం పొదిలి మండలం, పట్టణంలో విద్యుత్తుశాఖ అధికారులు 42 బృందాలుగా విడిపోయి తనిఖీలు చేసినట్లు చెప్పారు. తమ సిబ్బంది తనిఖీల్లో వివిధ రకాలుగా విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న వారిని గుర్తించామన్నారు. 79 మంది పై రూ.3.43 లక్షలు అపరాధరుసుం విధించినట్లు చెప్పారు. ఈ సమావేశంలో ఎస్ఈడీపీఈ మూర్తి, మార్కాపురం, కనిగిరి డీఈలు, పొదిలి ఏడీఈ క్రిష్ణారెడ్డి, ఏఈ మోహన్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.


# ప్రజలకు ప్రభుత్వం అన్ని వేళలా అందుబాటులో ఉంటుంది

## జిల్లా కలెక్టర్ పి రాజాబాబు



**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 10)**

ప్రజలకు ప్రభుత్వం అన్ని వేళలా అందుబాటులో ఉంటుందని అదే విధంగా జిల్లా యంత్రాంగం కూడా అందుబాటులో ఉండి ప్రజలకు అవసరమైన సేవలు అందించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ పి రాజాబాబు పేర్కొన్నారు. గురువారం రాత్రి టంగుటూరు మండలం పొందూరు గ్రామంలో నిర్వహించిన పల్లె నిద్ర కార్యక్రమంలో భాగంగా గ్రామస్తులు పలువురు నాయకులు లేవనెత్తి నటువంటి పలు అంశాలను క్షుణ్ణంగా పరిశీలించేందుకు శుక్రవారం ఉదయం గ్రామంలో విస్తృతంగా పర్యటించారు. అందులో భాగంగా కాలనీలో ఇంటింటికి తిరిగి చెత్త ఎప్పుడు చెత్తను చేస్తున్న విధానాన్ని విధంగా కార్మికులు తీసుకుపోతున్న విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. ఇరిగేషన్ కెనాల్సు, అంగన్వాడి స్కూలు, ఎస్సీ కాలనీ, త్రాగునీటి సమస్యలు, లిఫ్ట్ ఇరిగేషన్ (ఎత్తిపోతల పథకం) చెత్త నుండి సంపద తయారీ కేంద్రాలు ఇతరాలను పరిశీలించిన పిదప జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సమస్యలు సత్వర పరిష్కార దిశగా పల్లె నిద్ర కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు. ఇందులో ప్రధానంగా ప్రభుత్వం అందిస్తున్న పథకాలు వాటి అమలు తీరును ఎప్పటికప్పుడు తెలుసుకోవడమే ప్రధాన ఉద్దేశం అని అదేవిధంగా స్థానిక సమస్యలను ప్రజల సమక్షంలోనే ముఖాముఖి నిర్వహించి తెలుసుకోవడం జరుగుతుందన్నారు. సమస్యల పరిష్కారానికి సంబంధించి జిల్లాస్థాయిలో నిధులతో కూడిన వైతే కన్వర్జెన్స్ ఫండ్స్ ద్వారా చేపట్టడం జరుగుతుందని లేదా పెద్ద మొత్తంలో నిధులు అవసరమయ్యే సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం జరుగుతుందన్నారు. ఆర్థికేతర సమస్యలను తక్షణమే పరిష్కరించే దిశగా అధికారులను ఆదేశించడం జరుగుతుందన్నారు. మూడు మండలాలను కలిపే కనెక్టివిటీ గల రోడ్డును పల్లె నిద్ర సమయంలో తన దృష్టికి తీసుకొని వచ్చారని క్షేత్రస్థాయిలో పరిశీలించడం జరిగిందన్నారు. ఎన్ఆర్ఈజీఎస్ పనులు, అంగన్వాడి భవనాలు, త్రాగునీటి సమస్యలను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ప్రజల సమస్యలు తెలుసుకోవడం తో పాటు ప్రభుత్వంపై అవగాహనను తెలుసుకోవడం జరుగుతుందని ఆయన తెలిపారు. పొందూరు గ్రామస్తులు సమస్యలను తెలియజేయడంతో పాటు సమస్యల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలు గురించి కూడా ప్రస్తావించడం గొప్ప విషయం అన్నారు. ఈ సందర్భంగా సచివాలయంలో సర్ ప్రోగ్రాం పై తీసుకుంటున్న చర్యలు గురించి ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా చిన్న పాప అక్షయకు పుట్టుకతోటే షుగర్ వ్యాధి బాధపడుతున్న దృష్ట్యా ఉచితంగా ఇన్సులిన్ ను ఇచ్చే విధంగా సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి చిరంజీవి, డ్వామా పీడీ జోసెఫ్ కుమార్, డిపిఓ, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి, డిఆర్డిఏ పిడి, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.











# క్వాలిటీలో ఎలాంటి కాంప్రమైజ్ ఉండకూడదు

### రానున్న మూడేళ్లలో ఒంగోలు నగరంలో పెండింగ్‌లో ఉన్న పనులు పూర్తిచేసి నగరాన్ని ఆధునికరంగా తీర్చిదిద్దాం

### ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు







**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూలై 10)**

ఒంగోలు నగరంలోని కమ్మపాలెంలో రూ.5.25 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న మెయిన్ రోడ్డు పనులను ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ రావు శుక్రవారం పరిశీలించారు. పనుల నాణ్యతను స్వయంగా తనిఖీ చేసిన ఆయన క్వాలిటీలో ఎలాంటి కాంప్రమైజ్ ఉండకూడదు. పది కాలాలపాటు మన్నికగా ఉండేలా పనులు చేపట్టాలని కాంట్రాక్టర్లకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. అనంతరం త్రోవగుంట ఆటోనగర్‌లో రూ.10.30 కోట్లతో చేపట్టిన రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే రహదారిని మరో రెండు మీటర్లు విస్తరించేలా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. రోడ్లకు ఇరువైపులా మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంపొందించాలని సూచించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన ఎమ్మెల్యే దామచర్ల ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మున్సిపల్ శాఖ మంత్రి నారాయణను కలిసి ఒంగోలు కార్పొరేషన్‌కు అవసరమైన నిధుల విడుదలపై విజ్ఞప్తి చేశామని, వారు సానుకూలంగా స్పందించారని తెలిపారు. రానున్న మూడేళ్లలో ఒంగోలు నగరంలో పెండింగ్‌లో ఉన్న అన్ని రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణాలను పూర్తి చేసి నగరాన్ని మరింత ఆధునికంగా తీర్చిదిద్దుతాం అని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ రావు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నగర అధ్యక్షుడు బండారు మదన్, డివిజన్ అధ్యక్షులు తిరుపతిరావు, రాంబాబు, మేడికొండ మోహన్, నగర పాలక సంస్థ కమిషనర్ వెంకట కృష్ణయ్య, హెల్త్ ఆఫీసర్ వైష్ణవి, ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.



# ప్రతి పౌరుడికి రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కు

### ప్రజాస్వామ్య రక్షణకు ఒక్క వజ్రాయుధం

### ఓటు కోల్పోతే ప్రజాస్వామ్యంలో మీ విలువ కోల్పోయినట్టే

### జూలై 14లోపు ఎన్యూమరేషన్ ఫారాలు సమర్పించి ఓటు హక్కును కాపాడుకోండి

### టీడీపీ సీనియర్ నాయకులు యాగంటి మల్లికార్జునరావు



**(షణ్ముఖ వెలుగు, మాచర్ల టౌన్, జులై 10)**

ప్రజాస్వామ్యానికి అసలైన బలం ప్రజల ఓటు. ప్రతి అర్హుడి పేరు ఓటరు జాబితాలో ఉండటం దేశ భవిష్యత్తుకు అత్యంత కీలకం. ఓటు హక్కును కాపాడుకోవడం ప్రతి పౌరుడి రాజ్యాంగబద్ధ బాధ్యత అని టీడీపీ సీనియర్ నాయకులు యాగంటి మల్లికార్జునరావు అన్నారు. మాచర్ల పట్టణంలోని రైల్వే స్టేషన్ లో వున్నా సచివాలయాన్ని సందర్శించిన ఆయన, అక్కడి బీఎల్ఓలతో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమం పురోగతిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ, జూలై 14వ తేదీలోపు ప్రతి అర్హుడైన ఓటరు ఎన్యూమరేషన్ ఫారాన్ని పూర్తి చేసి సంబంధిత బీఎల్ఓలకు అందజేసి తమ ఓటు హక్కును కొనసాగించుకోవాలని పిలుపునిచ్చారు..ప్రజాస్వామ్య వ్యవస్థకు వెన్నెముక ఓటు ఆ ఓటు హక్కును ప్రతి ఒక్కరూ కాపాడుకోవాల్సిన బాధ్యత ఉందని తెలుగుదేశం పార్టీ ఆ బాధ్యత వుంది అని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ఎన్నికల సంఘాల ఆదేశాల మేరకు చేపట్టిన ఈ సర్ కార్యక్రమం అత్యంత కీలకమైనదని తెలిపారు. జూలై 14వ తేదీ లోగా ప్రతి ఇంటికి వెళ్లి బిఎల్ఓ లు ఇచ్చే ఇనుమరేషన్ ఫార్మ్ ను ప్రతి కుటుంబ సభ్యుడు తప్పనిసరిగా నింపాలని సూచించారు. గత వైసీపీ పాలనలో రాజకీయ కక్షతో వేలాది మంది ఓట్లను అక్రమంగా తొలగించారు. మళ్లీ అలాంటి అన్యాయం జరగకుండా ఉండాలంటే ఇప్పుడు మనం అప్రమత్తంగా ఉండాలి. 18 ఏళ్లు నిండిన ప్రతి యువకుడు, ప్రతి కుటుంబంలోని సభ్యుడి పేరు ఓటరు జాబితాలో ఉండేలా చూసుకోవాలి. ఒకవేళ పేరు లేకపోతే వెంటనే బిఎల్ఓకు దరఖాస్తు చేసుకోవాలి అని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యం బతకాలంటే ప్రతి ఓటు లెక్కలో ఉండాలి. మన హక్కుల కోసం, మన పిల్లల భవిష్యత్తు కోసం ఈ అవకాశాన్ని వదులుకోవద్దు. తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించి, ఈ కార్యక్రమాన్ని 100% విజయవంతం చేయాలి అని పిలుపునిచ్చారు. ఓటు అనేది ఒక సాధారణ గుర్తింపు కాదు. అది రాజ్యాంగం ద్వారా ప్రజాస్వామ్యాని కాపాడడానికి ఇచ్చిన ఒక్క వజ్రాయుధం, ఒక్కో ఓటు దేశ దిశను నిర్ణయించే శక్తి కలిగి ఉంటుంది. కాబట్టి ప్రతి కుటుంబం అప్రమత్తంగా ఉండి, తమ పేర్లు ఓటరు జాబితాలో ఉన్నాయో లేదో ధృవీకరించుకోవాలి. అవసరమైన ఫారాలను గడువులోగా సమర్పించి ఓటు హక్కును పరిరక్షించుకోవాలి అని ఆయన అన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణలో ప్రతి పౌరుడు బాధ్యతతో ముందుకు రావాలని, ఓటు హక్కు విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావివ్వొద్దని అని యాగంటి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. జులై 21వ తేదీన ప్రకటించే ముసాయిథి ఓటర్ లిస్ట్‌లో మీ ఓటు లేకపోతే మీరు ఓటు హక్కు కోల్పోయినట్టే అని వెల్లడించారు. సమయం కేవలం నాలుగు రోజులు మాత్రమే ఉంది కాబట్టి అర్హులైన ప్రతి ఒక్కరికి ఓటు కల్పించడానికి బిఎల్వోలు, బిఎల్ఎలు ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాచర్ల పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కొమెర దుర్గారావు, స్థానిక నాయకులు, కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL/2023/89152, e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com